# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 219 | విశాఖపట్నం | 10-5-2026 ఆదివారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 219 | VISAKHAPATNAM | 10-5-2026 SUNDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



SBI

PATHAKAM NEWS

SCAN & PAY

UPI ID: 44576280686@sbi

BHIM | UPI | yono SBI | BHIM SBI Pay | G Pay | Paytm | PhonePe




## ఆర్టీసీ బస్సు బోల్తా.. 40 మంది ప్రయాణికులకు గాయాలు

2లో



## గాజువాకలో ఈ-బస్ స్టేషన్.. 50 ఎలక్ట్రిక్ బస్సుల కేటాయింపు..

3లో



## డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉండాలంటే ఏమి చేయాలి?

6లో



# ఫార్మా వ్యర్థాలతో నల్లగా మారిన ఉప్పరిగెడ్డ నీరు!

- ట్యాంకర్లతో తీసుకొచ్చి గెడ్డలోకి విడుదల
- భూగర్భ, సాగర జలాలు కలుషితం
- చేపలు, చెట్లు, మొక్కలు మృత్యువాత
- పట్టించుకోని కాలుష్య నియంత్రణ మండలి అధికారులు

**అచ్యుతాపురం, పతాకం న్యూస్:** అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల సరిహద్దులోని నాన్-సెజ్‌లో ఏర్పాటు చేసిన పలు ఫార్మా కంపెనీలు కాలుష్య వ్యర్థాలను శుద్ధి చేయకుండా సమీపంలోని ఉప్పరి గెడ్డలో విడిచిపెడుతున్నాయి. ఈ గెడ్డ నుంచి ఉప్పుటేరు ద్వారా కాలుష్య వ్యర్థాలు సముద్రంలో కలుస్తున్నాయి. ఫార్మా కంపెనీల నిర్వాకంతో భూగర్భ జలాలతోపాటు సముద్ర జలాలు కలుషితం అవున్నాయి. ఫార్మా వ్యర్థాలతో సముద్రంలో మత్స్య సంపదతోపాటు గెడ్డల్లో మొక్కలు, చెట్లు సైతం చనిపోతున్నాయి. అచ్యుతాపురం మండలం మోటూరుపాలెం, గుర్జపాలెం, రాంబిల్లి మండలం లాలంకోడూరు గ్రామాల పరిధిలోని నాన్-సెజ్ ప్రాంతంలో రెండు వందలకుపైగా ఫార్మా కంపెనీలు వున్నాయి. ఉత్పత్తుల తయారీ సమయంలో వెలువడే వ్యర్థజలాలను శుద్ధి చేయడానికి పూడి గ్రామం వద్ద ఏపీఐఐసీ అధికారులు ఎఫ్ల్యుయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను ఏర్పాటుచేశారు. కానీ దీని సామర్థ్యం తక్కువ కావడంతో ఫార్మా కంపెనీలు వినియోగించడంలేదు. ఇక్కడి నుంచి వ్యర్థాలను ట్యాంకర్ల ద్వారా పర వాడలోని రాంకీకి పంపుతున్నారు. అయితే అక్కడ సైతం శుద్ధి చేసే సామర్థ్యానికి మించి వ్యర్థాలు వస్తుండడంతో ట్యాంకర్ లారీలో గంటల తరబడి వేచి వుండాల్సి వస్తున్నది. దీంతో కొన్ని కంపెనీల యాజమాన్యాలు ఫార్మా వ్యర్థాలను రాత్రిపూట ట్యాంకర్లతో తీసుకొచ్చి సమీపంలోని ఉప్పరి గెడ్డలో వదిలేస్తున్నారు. ఫలితంగా గెడ్డ నీరంతా నల్లటి రంగులో చిక్కగా (ద్రవ తారు మాదిరిగా) మారిపోయింది. ఇందులోని చెట్లు, మొక్కలు మాడిపోతున్నాయి. గెడ్డ సమీపంలోకి వెళితే తీవ్రదుర్వాసన వస్తున్నది. గెడ్డ పక్కనున్న సీతపాలెం, ఎరకన్నపాలెం, కంసాలకాలనీ, చాటమట్ట గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉప్పరి గెడ్డ నుంచి ఫార్మా వ్యర్థాలు పూడిమడక ఉప్పుటేరులో, దాని నుంచి సముద్రంలో కలుస్తున్నాయి. ఫార్మా వ్యర్థ జలాలను యథేచ్ఛగా ఉప్పరిగెడ్డలో విడిచిపెడుతున్నప్పటికీ కాలుష నియంత్రణ మండలి అధికారులు పట్టించుకోవడంలేదని బాధిత గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. కనీసం ఇటువైపు కన్నెత్తి (తరువాయి 2వ పేజీలో)

# విశాఖ కైలాసగిరిపై భారీ త్రిశూలం ప్రారంభం

**విశాఖపట్నం, పతాకం న్యూస్:** విశాఖ పర్యాటక కేంద్రం కైలాసగిరిపై మరో అద్భుతం ఆవిష్కృతమైంది. ఢమరుకంతో కూడిన 65 అడుగుల ఎత్తైన భారీ త్రిశూలం ప్రాజెక్ట్ ప్రారంభమైంది. శనివారం ఉదయం మంత్రులు నారాయణ, కొండపల్లి శ్రీనివాస్, విశాఖ ఎంపీ శ్రీభరత్, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ భారీ త్రిశూలంను ప్రారంభించారు. వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ ఆధ్వర్యంలో త్రిశూలం ప్రాజెక్ట్‌ను చేపట్టారు. మూడు కోట్ల రూపాయల వ్యయంతో త్రిశూలం ప్రాజెక్ట్‌ను నిర్మించారు. విశాఖ నగరంలో ఎక్కడి నుంచి కైలాసగిరి వైపు చూసినా స్పష్టంగా కనిపించేలా 65 అడుగుల



ఎత్తున్న త్రిశూలంను ఏర్పాటు చేశారు. రాత్రి సమయంలో కూడా ఆకర్షణీయంగా కనిపించేందుకు 100 వాట్స్ సామర్థ్యం గల 90 ఎల్‌ఈడీ లైట్లను అమర్చారు. ఈ ప్రాజెక్ట్‌ను కేవలం 8 నెలల్లో పూర్తి చేసి ప్రజలు, పర్యాటకులకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వీఎంఆర్‌డీఏ అధికారులు తెలిపారు.

## విజయ్‌కు మద్దతు ప్రకటించిన వీసీకే..

### తమిళనాడులో హైడ్రామాకు తెర



**చెన్నై, పతాకం న్యూస్:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో తమిళ వెట్రి కజగం (టివికె) భారీ మెజార్టీ సాధించింది. అయితే మెజార్టీ సీట్లు రాకపోవడంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో విజయ్ నానా అవస్థలు పడుతున్నారు. ఎట్టకేలకు ఈ హైడ్రామాకు నేటితో తెరపడింది. టివికె ప్రభుత్వ ఏర్పాటుకు విడుతలై (తరువాయి 2వ పేజీలో)

## విధ్వంసం నుంచి వికాసం వైపుకు ఏపీ: సంధ్యారాణి



**అమరావతి, పతాకం న్యూస్:** విధ్వంస పాలన నుంచి వికాస పాలన వైపు రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందుకు తీసుకెళ్తున్నారని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ... 23 నెలల కూటమి పాలనలో భయపెట్టే రాజకీయాలకు ముగింపు పలికి, భరోసా కలిగించే పరిపాలన అందుతోందన్నారు. వైసీపీ హయాంలో ప్రజల సమస్యలు చెప్పుకోవడానికే భయపడేవారని.. నేడు ప్రజలకు అందుబాటులో ఉన్న ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. వైజాగ్ అంటే ఒకప్పుడు గంజాయి గుర్తొచ్చేదని.. నేడు గూగుల్, టీసీఎస్ వంటి ప్రపంచ స్థాయి సంస్థలు గుర్తుకొస్తున్నాయని మంత్రి అన్నారు. అరకు, పాడేరు ప్రాంతాల్లో గంజాయి తోటల స్థానంలో కాఫీ తోటలు విస్తరిస్తున్నాయని (తరువాయి 2వ పేజీలో)

## కనక దుర్గమ్మను దర్శించుకున్న లోకేశ్



**విజయవాడ, పతాకం న్యూస్:** ప్రముఖ పుణ్యక్షేత్రం విజయవాడ ఇంద్రకిలాద్రిపై వెలసిన కనకదుర్గమ్మను ఐటీ శాఖ మంత్రి, టీడీపీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ దర్శించుకున్నారు. శనివారం ఉదయం ఆలయానికి వచ్చిన మంత్రికి దేవాదాయ కమిషనర్ రాంచంద్ర మోహన్, ఆలయ ఈవో శీనా నాయక్, పాలక మండలి చైర్మన్ బొర్ర రాధా కృష్ణ.. పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారి ఆలయంలో లోకేశ్ ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి దర్శనం అనంతరం లోకేశ్‌కు వేద పండితులు ఆశీర్వాదం అందించగా... అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని ఆలయ అధికారులు అందజేశారు.



## రాష్ట్రంలో వాక్‌స్వాతంత్ర్యంపై దాడి: జగన్ విమర్శలు

2లో

## ప్రాపర్టీ టాక్స్ విషయంలో పాత విధానాన్ని కొనసాగిస్తున్నాం: నారాయణ



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** వీఎంఆర్డీఏ కార్యాలయంలో మాస్టర్ ప్లాన్‌పై పురపాలక శాఖ మంత్రి నారాయణ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాస్టర్ ప్లాన్‌పై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. నగరం అభివృద్ధి చెందాలంటే మాస్టర్ ప్లాన్ అవసరమని ఆయన తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించామమని మంత్రి వెల్లడించారు. 'నగరం అభివృద్ధి చెందాలి అంటే మాస్టర్ ప్లాన్ అవసరం. 6,836 చదరపు కి.మీ పరిధిలో వీఎంఆర్డీఏ ఉంది. 4,387.36 చదరపు కిలోమీటర్ల పరిధిలో మాస్టర్ ప్లాన్ సిద్ధమైంది. మిగిలిన ప్రాంతంలో రానున్న అక్టోబర్ నెలకు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తాం. (తరువాయి 2వ పేజీలో)


పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా..

అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా..

పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS

State Bank of India

A/c No: 44576280686

IFSC:SBIN00021297

DUVVADA BRANCH

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

### కుట్ర..

ప్రజా తీర్పును వమ్ము చేసేలా గవర్నర్లతో తోలు బొమ్మలాడించే విధానాన్నే తాజాగా తమిళనాట బిజెపి కేంద్ర ప్రభుత్వం అనుసరించడం దారుణం. తమిళనాడు అసెంబ్లీకి ఏప్రిల్ 23న జరిగిన ఎన్నికల్లో విజయ్ నాయకత్వం లోని పార్టీ అత్యధిక స్థానాల్లో గెలుపొందింది. 234 స్థానాలున్న అసెంబ్లీలో 108 స్థానాల్లో విజయ దుందుభి మోగించింది. అధికారం పొందడానికి అవసరమైన మేజిక్ ఫిగర్ కు కేవలం పదకొండు స్థానాలు తక్కువ. ఇటువంటి పరిస్థితిలో అసెంబ్లీలో అతి పెద్ద పార్టీగా అవతరించిన పార్టీ నేతను ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయించడం రాజ్యాంగ సంప్రదాయం. గతంలో అటల్ బిహారి వాజ్‌పేయి నాయకత్వంలోని బిజెపికి నాటి రాష్ట్రపతి అటువంటి అవకాశం ఇవ్వడం 13 రోజుల్లో మెజారిటీ రుజువు చేసుకోలేక వాజ్‌పేయి రాజీనామా చేసిన విషయం అందరికీ తెలిసిందే! దేశంలోనూ వివిధ రాష్ట్రాల్లోనూ ఇటువంటి దృష్టాంతాలెన్నో ఉన్నాయి. భారత సర్వోన్నత న్యాయ స్థానం ప్రఖ్యాత ఎస్ ఆర్ బొమ్మై కేసు తీర్పు లోను ఈ విషయం పేర్కొంది. అంతేగాక ప్రభుత్వ మెజారిటీని నిర్ణయించేది శాసన సభలో తప్ప రాజభవన్ లో కాదని కూడా స్పష్టం చేసింది. ఇన్ని ఉన్నా సంఘ్ పరివార్ కుదురు నుండి వచ్చిన రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ మహాశయుడు మాత్రం మెజారిటీ పట్ల తనకు సంతృప్తి లేదంటూ అతి పెద్ద పార్టీ నాయకుడిని రెండు సార్లు తిరస్కరించడం అప్రజాస్వామికం, రాజ్యాంగ విరుద్ధం. రాష్ట్ర ప్రభుత్వాలను ఢిల్లీ నుండి ఆడించడానికి గవర్నర్లను ఉపయోగించడం దశాబ్దాలుగా కొనసాగుతోంది. ప్రజలెన్నుకున్న ప్రభుత్వాలను గవర్నర్ల ద్వారా ఇబ్బందుల పాల్జేయడం మొదలు వాటిని రద్దు చేయడం వరకూ గతంలో జరిగినవే. కేంద్ర ప్రభుత్వం 356వ అధికరణం ప్రయోగించి రద్దు చేసిన తొలి ప్రభుత్వం ప్రఖ్యాత కమ్యూనిస్టు నేత నంబూద్రిపాద్ నాయకత్వం లోనిదేనన్నది లోక విదితం.

తమిళనాడు ప్రజలు విజయ్ నాయకత్వంలోని టివికె పార్టీకి బ్రహ్మరథం పట్టారు. అదే సమయంలో దీర్ఘ కాలం పాటు ఆ రాష్ట్రాన్ని పాలించిన డి ఎం కె, అన్నాడిఎంకె పార్టీలను తిరస్కరించారు. మిగిలిన అన్ని పార్టీలకూ సింగిల్ డిజిట్ దక్కగా కనిష్టంగా బిజెపికి ఒకే ఒక్క స్థానం లభించింది. దక్షిణ భారత దేశంలో ఎలాగైనా చక్రం తిప్పాలనుకున్న కమలం పార్టీకి తమిళ ప్రజల తీర్పు ఆగ్రహం కలిగించడంతో అనిశ్చిత పరిస్థితి ఏర్పర్చి ఆ రాష్ట్రంపై గవర్నర్ ద్వారా కసి తీర్చుకుంటోందన్నది జన వాక్యం. ఫలితాలు వచ్చిన మరునాడే అతి పెద్ద పార్టీగా వచ్చిన తమను ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని విజయ్ చేసిన విజ్ఞప్తిని గవర్నర్ తిరస్కరించడం అప్రజాస్వామికం. ఆ మరుసటి రోజున అయిదు సీట్లున్న కాంగ్రెస్ పార్టీ మద్దతు కూడా ఉందని మెజారిటీకి అవసరమైన మద్దతు కూడా సమకూర్చుకుంటామని చెప్పి ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతించాలని కోరినా తనకు సంతృప్తి కలగలేదంటూ తిరస్కరించడం కుట్ర పూరితమే! వరుసగా రెండు సార్లు తిరస్కరించారంటే అర్లేకర్ కు రాజ్యాంగ సంప్రదాయాల పట్ల కానీ, సర్వోన్నత న్యాయస్థానం తీర్పుల పట్ల కానీ కనీస గౌరవం లేదని తేటతెల్లమవుతోంది. తమిళ ప్రజా తీర్పును అమలు చేయడానికి తమిళనాట గందరగోళం సృష్టించాలన్న బిజెపి కుట్రను తిప్పి కొట్టడానికి వామపక్షాలు సరైన నిర్ణయం తీసుకొని టివికె ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతు ప్రకటించడం హర్షణీయం. విసికె మద్దతు లేఖ ఇస్తే మేజిక్ ఫిగర్ చేరుకోవడం, టివికె ప్రభుత్వ ఏర్పాటుకు అర్లేకర్ అంగీకరించడం తప్పదు. ఇటువంటి గవర్నర్ల వ్యవస్థ మన దేశానికి అవసరమా? ముమ్మాటికీ లేదనే ప్రజాస్వామ్య వాదుల సమాధానం. ప్రజా తీర్పును అపహాస్యం చేసే ఈ వ్యవస్థ లేకుంటేనే మంచిది. అప్పుడే రాజ్యాంగం ప్రవచించిన ఫెడరలిజం పరిఢవిల్లుతుంది.

## రాష్ట్రంలో వాక్‌స్వాతంత్ర్యంపై దాడి: జగన్ విమర్శలు



**తాడేపల్లి, పతాకం న్యూస్:** వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంపై సంచలన ఆరోపణలు చేశారు. 'హలో ఇండియా' అంటూ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఆయన చేసిన ఓ పోస్ట్ రాజకీయంగా కలకలం రేపుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పోలీసు విభాగాన్ని తన రాజకీయ ఏజెంట్లుగా వాడుకుంటూ ప్రతిపక్ష గొంతును అణచివేస్తున్నారని జగన్ తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రంలో వాక్‌స్వాతంత్ర్యాన్ని హరిస్తున్నారని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 కల్పించిన హక్కుకు భంగం కలిగిస్తున్నారని జగన్ ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలు, అవినీతి, ప్రజా వ్యతిరేక విధానాలను విమర్శిస్తున్న వారిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. సోషల్ మీడియా యాక్టివిస్టులు, వైసీపీ మద్దతుదారులు, పాత్రికేయులు, చివరికి సాధారణ పౌరులను కూడా లక్ష్యంగా చేసుకుని తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ఆయన ఆరోపించారు. "రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ పూర్తిగా గాడి తప్పింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మొత్తం పోలీస్ యంత్రాంగాన్ని తన రాజకీయ అవసరాల కోసం వినియోగించుకుంటున్నారు" అని జగన్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. అధికార పార్టీ నేతలు ఫిర్యాదు చేస్తే వెంటనే స్పందించే పోలీసులు, తమ పార్టీ నేతలు ఇచ్చే ఫిర్యాదులను పట్టించుకోవడం లేదని, ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నారని జగన్ ఆరోపించారు. ప్రభుత్వాన్ని విమర్శించే వారి సోషల్ మీడియా ఖాతాలను తొలగించాలని నోటీసులు ఇవ్వడం ద్వారా వ్యవస్థీకృత సెన్సార్‌షిప్‌కు పాల్పడుతున్నారని కూడా జగన్ విమర్శించారు.

## బెంగాల్ తొలి బీజేపీ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సువేందు అధికారి



**కోల్‌కతా, పతాకం న్యూస్:** పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో ఒక సుదీర్ఘ నిరీక్షణకు ఈరోజు తెరపడింది. తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీకి ఒకప్పుడు అత్యంత సన్నిహితుడిగా, ఆమె రాజకీయ వ్యూహాల్లో కీలక పాత్ర పోషించిన సువేందు అధికారి... ఈరోజు అదే బెంగాల్ గడ్డపై ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. కమ్యూనిస్టుల కోటను బద్దలు కొట్టిన మమత దగ్గరే రాజకీయ ఓనమాలు నేర్చుకుని, చివరకు ఆమెనే ఓడించి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టించడం ఒక పక్కా పొలిటికల్ థ్రిల్లర్‌ను తలపిస్తోంది. సువేందు అధికారి ప్రస్థానం నిజంగానే అద్భుతమని చెప్పొచ్చు. నందిగ్రామ్, భవానీపూర్ ఉద్యమాల్లో మమతకు వెన్నెముకగా నిలిచిన ఆయన, నేడు ఆమె కూర్చున్న కుర్చీలోనే ముఖ్యమంత్రిగా ఆసీనులయ్యారు. బెంగాల్ ఓటర్లు ఆయనకు పట్టం కట్టడం ద్వారా రాష్ట్రంలో ఒక కొత్త శకానికి నాంది పలికారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఏపీ సీఎం చంద్రబాబుతో పాటు పలువుకు అగ్ర నేతలు స్వయంగా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

## ఆర్టీసీ బస్సు బోలా.. 40 మంది ప్రయాణికులకు గాయాలు



**రంపచోడవరం, పతాకం న్యూస్:** పోలవరం జిల్లా రంపచోడవరం మండలం పాత గాంధీనగరం మలుపులో ఆర్టీసీ బస్సు అదుపుతప్పి బోల్తా పడింది. ఎక్స్‌ప్రెస్ బస్సు 40 మంది ప్రయాణికులతో భద్రాచలం నుంచి కాకినాడ వైపు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో బస్సులో ఉన్న ప్రయాణికులందరూ గాయపడ్డారు. క్షతగాత్రులను రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు

## ఉప్పరిగెడ్డ నీరు!

(మొదటిపేజీ తరువాయి)

అయినా చూడడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవంగా ఇక్కడి ఫార్మా కంపెనీల వ్యర్థాలను శుద్ధి చేయడానికి పూడి గ్రామం వద్ద ఎఫ్ల్యూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఈటీపీ)ని ఏపీఐఐసీ ఏర్పాటుచేసింది. రోజుకి 1,500 కేఎల్ వ్యర్థాలను మాత్రమే శుద్ధి చేయగల సామర్థ్యం వుంది. కానీ ఇక్కడి కంపెనీల నుంచి రెట్టింపు వ్యర్థాలు వస్తుండడంతో కొంతమేర వ్యర్థాలను ట్యాంకర్ల ద్వారా పరవాడలో రాంకీకి పంపుతున్నారు. మరోవైపు వ్యర్థాలను శుద్ధి చేయడానికి ఖర్చు అధికంగా వుందన్న ఉద్దేశంతో కొన్ని కంపెనీల నిర్వాహకులు ఫార్మా వ్యర్థాలను రాత్రిపూట ట్యాంకర్ల ద్వారా తీసుకొచ్చి ఉప్పరిగెడ్డలో పోస్తున్నారు.

## డిప్యూటీ సీఎం పదవి ఇస్తేనే విజయ్‌కి మద్దతు.. వీసీకే డిమాండ్!



**చెన్నై, పతాకం న్యూస్:** తమిళనాడులో ప్రభుత్వ ఏర్పాటుపై ఉత్కంఠ ఇంకా తొలగిపోలేదు. నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీకి మద్దతివ్వడానికి విద్యుతలై చిరుతైగల్ కట్చి (వీసీకే) కీలకమైన డిమాండ్లను ముందుకు తెచ్చింది. ప్రభుత్వ ఏర్పాటులో తమకు ఉప ముఖ్యమంత్రి పదవి కేటాయించాలని వీసీకే అధినేత తోల్ తిరుమావళవన్ పట్టుబడుతున్నట్లు సమాచారం. పార్టీ అధినేత అధ్యక్షతన జరిగిన ఉన్నత స్థాయి వర్చువల్ సమావేశంలో ఈ మేరకు చర్చించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. తిరుమావళవన్‌కు డిప్యూటీ సీఎం పదవితో పాటు, పార్టీ తరఫున గెలిచిన ఇద్దరు ఎమ్మెల్యేలకు కేబినెట్‌లో స్థానం కల్పించాలని వీసీకే డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఏప్రిల్ 23న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వీసీకే రెండు స్థానాల్లో విజయం సాధించింది. 234 స్థానాలున్న తమిళనాడు అసెంబ్లీలో 108 సీట్లు గెలుచుకున్న టీవీకే, అతిపెద్ద పార్టీగా అవతరించింది. అయితే, ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజారిటీకి మరికొంత మద్దతు అవసరం కావడంతో వీసీకే కీలకంగా మారింది. మరోవైపు, రెండు నియోజకవర్గాల్లో గెలిచిన విజయ్, చెన్నైలోని పెరంబూర్ స్థానాన్ని అట్టిపెట్టుకుని, తిరుచిరాపల్లి ఈస్ట్ స్థానానికి రాజీనామా చేసే అవకాశం ఉంది. అక్కడ జరిగే ఉప ఎన్నికలో తిరుమావళవన్ పోటీ చేయవచ్చనే ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి. పదవులతో పాటు, గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన కుల హత్యల విచారణ కమిషన్లను కొనసాగించాలని, ప్రభుత్వ ఉద్యోగ పదోన్నతుల్లో దళితులకు రిజర్వేషన్లు అమలు చేయాలని వీసీకే కోరుతోంది.

## రాజమహేంద్రవరంలో నూతన 10 కోర్టు భవనాలను ప్రారంభించిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్



**రాజమహేంద్రవరం, పతాకం న్యూస్:** రాజమహేంద్రవరంలో నిర్మించిన నూతన 10 కోర్టు భవన సముదాయాలను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్ శనివారం ప్రారంభించారు. శిలాఫలక ఆవిష్కరణతో కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో జిల్లా పరిపాలనా న్యాయమూర్తి బట్టు దేవానంద్ తో పాటు హైకోర్టు న్యాయమూర్తులు ఆర్. రఘునందన్ రావు, జస్టిస్ బి.వి.ఎల్.ఎన్. చక్రవర్తి, జస్టిస్ సుమతి జగడం, జస్టిస్ న్యాపతి విజయ్ పాల్గొన్నారు. నూతన కోర్టు హాళ్లు, ఆధునిక సదుపాయాలను న్యాయమూర్తులు పరిశీలించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత గంధం స్వాగత ప్రసంగం చేసి, భవన నిర్మాణ విశేషాలను వివరించారు. రాజమండ్రి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ వి ప్రసాద్ నూతన కోర్టు భవనాల నిర్మాణాన్ని అభినందించారు. న్యాయ వ్యవస్థలో ఆధునిక మౌలిక వసతుల ప్రాముఖ్యత, ప్రజలకు త్వరితగతిన న్యాయం అందించడంలో కోర్టు సదుపాయాల అవసరంపై న్యాయమూర్తులు ప్రసంగించారు. కార్యక్రమంలో నూతన కోర్టు భవన నిర్మాణంపై ప్రత్యేక వీడియోను కూడా ప్రదర్శించారు.

(మొదటిపేజీ తరువాయి)

## విధ్వంసం నుంచి వికాసం వైపుకు ఏపీ: మంత్రి సంధ్యారాణి

తెలిపారు. ఉత్తరాంధ్రకు రైల్వే జోన్ సాధించడం కూటమి ప్రభుత్వ చరిత్రాత్మక విజయంగా చెప్పుకొచ్చారు. యువత చేతిలో ఆయుధాలు కాదు.. ఉద్యోగాలు, నైపుణ్యాలు, అవకాశాలు ఉండాలనేదే కూటమి ప్రభుత్వ ఆలోచన అని స్పష్టం చేశారు. అమరావతి నిర్మాణానికి రైతులు స్వచ్ఛందంగా భూములు ఇవ్వడం రాష్ట్ర చరిత్రలో గొప్ప సంఘటనన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ పునరుద్ధరణకు కేంద్ర సహకారంతో వేల కోట్ల పెట్టుబడులు తీసుకువచ్చామని సంధ్యారాణి అన్నారు. గంజాయి నిర్మూలన కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి కఠిన చర్యలు చేపట్టామని తెలిపారు. జగన్‌కు ఇంట్లో వారిపైనే గౌరవం లేదని.. ఇక ప్రజలపై గౌరవం ఎలా ఉంటుందని ప్రశ్నించారు. అధికార దాహం కోసం యువత చేతికి కత్తులు, గొడ్డళ్లు ఇచ్చే వైసీపీ నేతల మోసపూరిత మాటలకు బలికావొద్దని.. కోడికత్తి శ్రీను ఉదంతాన్ని గుర్తు తెచ్చుకోవాలని సూచించారు. సూపర్ 6 పథకాలు గిరిజనులకు ఎంతగానో తోడ్పడుతున్నాయని మంత్రి సంధ్యారాణి పేర్కొన్నారు.

## విజయ్‌కు మద్దతు ప్రకటించిన వీసీకే

చిరుతైగల్ కట్చి (విసికె) మద్దతు ప్రకటించింది. విసికెకు ఉన్న రెండు స్థానాలు మద్దతు ప్రకటించడంతో టివికెకి మెజార్టీ లభించింది. కాంగ్రెస్ 5, సిపిఐ (2), సిపిఐ(ఎం) : 2, విసికె : 2 మొత్తం టివికె 108తో సహా 119 సీట్ల మెజార్టీ లభించింది. అయితే ఇప్పటివరకు విజయ్ మళ్లీ గవర్నర్ అర్లేకర్ ప్రభుత్వ ఏర్పాటుకు కలుస్తారనే వార్తలు మీడియాలో రాలేదు.

## కొనసాగిస్తున్నాం: నారాయణ

వీఎంఆర్డీఏ మాస్టర్ ప్లాన్‌పై వచ్చిన వినతులపై సమీక్షలో చర్చ జరిపాం. ఎమ్మెల్యేలు తీసుకువచ్చిన వినతులు 90 శాతం పైగా పరిష్కారం చూపాం. 2021లో రూపొందించిన మాస్టర్ ప్లాన్‌ను రీవిజిట్ చేయాలని ప్రజా ప్రతినిధులు సీఎంను కోరారు. దీనిపై భారీ ఎత్తున అభ్యంతరాలు వచ్చాయి. తొలుత 3720 అభ్యంతరాలు రాగా రెండవ సారి 1236 అభ్యంతరాలు వచ్చాయి. సమీక్షకు హాజరుకాని ఎమ్మెల్యేలతో చర్చించి మాస్టర్ ప్లాన్ ప్రకటిస్తాం' అని మంత్రి నారాయణ తెలిపారు. 'హైదరాబాద్ తరహాలో విశాఖలో సెమి రింగ్ రోడ్డు నిర్మించాలని సీఎం చంద్రబాబు ప్రతిపాదించారు. రాంబిల్లి నుంచి భోగాపురం వరకు 102 కి.మీ మేర సెమి రింగ్ రోడ్డు నిర్మాణం. ఈనెల చివరికి సెమి రింగ్ రోడ్డు డీపీఆర్ సిద్ధం అవుతుంది. అలానే భోగాపురం విమానాశ్రయంకు బీచ్ కారిడార్ ప్రతిపాదన ఉంది. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో ఎస్టీపీలు ఏర్పాటు చేస్తున్నాం. ప్రాపర్టీ టాక్స్ విషయంలో పాత విధానాన్ని కొనసాగిస్తున్నాం' అని మంత్రి నారాయణ వెల్లడించారు.

# గాజువాకలో ఈ-బస్ స్టేషన్.. 50 ఎలక్ట్రిక్ బస్సుల కేటాయింపు..




**గాజువాక, పతాకం న్యూస్:** గాజువాక ఆర్టీసీ డిపోను ఆనుకుని ఉన్న నాలుగున్నర ఎకరాల్లో ఈ-బస్‌స్టేషన్ నిర్మాణానికి సన్నాహాలు మొదలయ్యాయి. విశాఖ రీజియన్‌కు కేటాయించిన వంద ఎలక్ట్రిక్ బస్సుల్లో గాజువాక డిపోకు 50 కేటాయించినట్టు రీజనల్ అధికారులు చెబుతున్నారు. ఆగస్టు నెల మొదటివారంలో ఈ-బస్సులు వచ్చే అవకాశం ఉందని ఆర్టీసీ ప్రధాన కార్యాలయం నుంచి సమాచారం అందడంతో గాజువాకలో ఈ-బస్‌స్టేషన్ ఏర్పాటు పనులు వేగవంతం చేశారు. ఎలక్ట్రిక్ బస్ డిపో కోసం కేటాయించిన స్థలాన్ని చదును చేసే పనులు చురుకుగా సాగుతున్నాయి. ఇక్కడ చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటుచేయనున్నారు. కాగా, ప్రధాన రహదారి నుంచి ఈ-బస్సుల డిపోనకు గల మార్గాన్ని 30 మీటర్ల మేర వెడల్పు చేస్తున్నారు. ఈ క్రమంలో ఫుట్‌పాత్‌లను తొలగించారు. బస్సులు వచ్చే సమయానికి డిపోను సిద్ధం చేయాలని ఆర్టీసీ అధికారులు భావిస్తున్నారు.

## ఆదివాసీ రైతుల కాఫీ సాగుపై అధ్యయనం



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** అరకు కాఫీకి ప్రపంచ ఖ్యాతి లభించడం శుభపరిణామని అరుణాచల్‌ప్రదేశ్ అటవీ అభివృద్ధి సంస్థ(ఏపీఎఫ్‌డీసీ) చైర్మన్ నరోంగ్ మైజ్ అన్నారు. అరుణాచల్‌ప్రదేశ్ నామ్సాయి ఎమ్మెల్యే సీజెడ్ నామ్‌సూమ్, ఏపీఎఫ్‌డీసీ వైస్ చైర్మన్ జి. బాకీ, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు పి. సుబ్రహ్మణ్యం బృందం చింతపల్లి, జీకేవీధి మండలాల్లో పర్యటించింది. తొలుత చింతపల్లి ఏపీఎఫ్‌డీసీ రీజనల్ మేనేజర్ క్యాంప్ కార్యాలయంలో ఏపీ అటవీ అభివృద్ధి సంస్థ, జీసీసీ అధికారులతో సమావేశమయ్యారు. అనంతరం జీకేవీధి మండలం చాపగెడ్డలో ఏపీఎఫ్‌డీసీ సాగు చేస్తున్న నర్సరీని పరిశీలించారు. కొత్తగూడెంలో ఆర్గానిక్ పద్ధతిలో కాఫీ సాగు చేస్తున్న గిరిజన రైతులతో చర్చించారు. కాఫీ సాగు చేస్తున్న విధానం, ఆదాయం వివరాలను అడిగి తెలుసుకున్నారు. కాఫీ గింజల మార్కెటింగ్, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రైతులకు అందుతున్న ప్రోత్సాహం, సహకారాన్ని బృందం అడిగి తెలుసుకుంది. ఈ సందర్భంగా అరుణాచల్‌ప్రదేశ్ అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ నరోంగ్ మైజ్ మాట్లాడుతూ ఆంధ్ర గిరిజన రైతులకు కాఫీ సాగు పెనుమార్పులు తీసుకొచ్చినట్టు గుర్తించామన్నారు. ఆదివాసీలు కాఫీని ప్రధాన వాణిజ్యపంటగా సాగు చేస్తున్నారని, తద్వారా అధిక ఆదాయం లభిస్తుందన్నారు. ప్రపంచ దేశాలు అరకు కాఫీ రుచుల కోసం ఆంధ్ర గిరిజన ప్రాంతం వైపు చూడడం గొప్ప విషయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కాఫీ సాగును ప్రోత్సహిస్తున్న విధానం అభినందనీయమన్నారు. అరుణాచల్‌ప్రదేశ్ గిరిజన ప్రాంత ఆదివాసీలతో కాఫీ సాగు చేపట్టాలని ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. రానున్న రోజుల్లో అరుణాచల్‌ప్రదేశ్ ప్రభుత్వం చేపట్టనున్న కాఫీ సాగుపై ఆంధ్ర ప్రభుత్వ సహకారం తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ విశాఖపట్నం రీజనల్ మేనేజర్ శ్రీకాంత్‌నాథ్ రెడ్డి, స్థానిక డీఎఫ్‌వో వైవీ నరసింహరావు, పాడేరు, చింతపల్లి, ఆర్‌వీనగర్ డివిజన్ మేనేజర్లు జి.కృష్ణబాబు, జీఎస్‌వీ సత్యం, పి. రత్నదీప, జీసీసీ జనరల్ మేనేజర్(కాఫీ) వి. ఉమాదేవి, చింతపల్లి డీఎం డి. సింహాచలం, కొయ్యూరు, చింతపల్లి, జీకేవీధి బ్రాంచి మేనేజర్లు సరమండ విజయకుమార్, చల్లంగి సుగునాథం, రాజుబాబు పాల్గొన్నారు.

## మన్యంలో విభిన్న వాతావరణం



**ముంచంగిపుట్టు, పతాకం న్యూస్:** అల్లూరి సీతారామరాజు జిల్లాలో విభిన్న వాతావరణం నెలకొంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తారెత్తించింది. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. గత రెండు రోజులుగా ఇదే వాతావరణం నెలకొంది. దీంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారుతున్నది. వర్షంతో పలు గ్రామాలకు వెళ్లే మట్టి రహదారులు అధ్వానంగా మారాయి. వాహన రాకపోకలు సాగించేందుకు వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. మండు వేసవిలో ఈ అకాల వర్షాలు కారణంగా ఎండ వేడికి విలవిలలాడుతున్న ప్రజలు కాస్త ఉపశమనం పొందుతున్నారు. అయితే ఈ ఏడాది మత్స్యగెడ్డ పాయలు అడుగంటిపోవడంతో భారీ వర్షాలు కురిస్తే గానీ జోలాపుట్టు, డుడుమ జలాశయాలకు పూర్వవైభవం వచ్చే అవకాశం లేదు. దీంతో భారీ వర్షాలు పడితే బాగుంటుందని ప్రాజెక్టు వర్గాలు అంటున్నాయి. అనంతగిరి మండల కేంద్రంలోని ం మధ్యాహ్నం గంటపాటు కురిసిన భారీ వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఉదయం నుంచి ఎండ తీవ్రత అధిక ఉండడంతో ప్రజలంతా ఉక్కిరిబిక్కిరయ్యారు. మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు గంటపాటు కురిసిన వర్షంతో ప్రజలు ఉపశమనం పొందారు. పంట పొలాల్లో నీరు చేరడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. జీకేవీధి మండలం సీలేరులో మధ్యాహ్నం వర్షం కురిసింది. దీంతో ప్రజలకు ఎండ వేడి నుంచి కాస్త ఉపశమనం కలిగింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత పెరుగుతూ మధ్యాహ్నానికి 38 డీగ్రీలకు ఉష్ణోగ్రత చేరుకుంది. ఎండ వేడికి తట్టుకోలేక ప్రజలు చెట్ల నీడకు చేరుకున్నారు. ఈలోగా మేఘాలు వేసి గాలితో కూడిన వర్షం పడింది. వాతావరణం చల్లబడడంతో ఈప్రాంతీయులు కాస్త ఊపిరిపీల్చుకున్నారు.

## 21 నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** జిల్లాలో ఈనెల 21 నుంచి నిర్వహించనున్న ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఎనిమిది జోన్‌లలో 60 కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. మొత్తం 51 ప్రైవేటు, నాలుగు ప్రభుత్వ, ఒక సోషల్ వెల్ఫేర్, ఒక ట్రైబల్ వెల్ఫేర్, ఒక ఎయిడెడ్ కళాశాలల్లో కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో సీసీ కెమెరాలు అమర్చారు. మూడేసి ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించారు. సప్లిమెంటరీ పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 45,554 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరిలో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 28,361, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 17,193 మంది ఉన్నారు. ఈనెల 21 నుంచి జూన్ 2 వరకు ప్రతిరోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రథమ సంవత్సరం, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరుగుతాయి. జూన్ 5న నీతి, మానవ విలువలు, 6న పర్యావరణం పరీక్ష నిర్వహిస్తారు. ప్రశ్నపత్రాలను భద్రపరిచేందుకు 14 స్టోరేజ్ పాయింట్‌లను ఏర్పాటుచేశారు. ఈ ఏడాది ప్రథమ సంవత్సరం పరీక్షలకు 38,392 మంది విద్యార్థులు హాజరవగా 6,058 మంది ఫెయిల్ అయ్యారు. కానీ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీకి 28,361 ఫీజు చెల్లించారు. అంటే 22,303 మంది బెటర్‌మెంట్ రాసేందుకు సిద్ధమవుతున్నారు. అలాగే ద్వితీయ సంవత్సరంలో ఫెయిలైనవారు 5,869 మంది మాత్రమే కాగా బెటర్‌మెంట్‌కు 11,324 మంది ఫీజులు చెల్లించడం విశేషం. ఎంసెట్, నీట్, జేఈఈ ర్యాంకుల్లో ఇంటర్ మార్కులకు వెయిటేజీ ఉండడంతో సైన్స్ గ్రూపు సబ్జెక్టుల విద్యార్థులు మార్కులు పెంచుకునేందుకు వీలుగా ఈ ఏడాది బెటర్‌మెంట్ రాసేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలో ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఇంటర్మీడియట్ బోర్డు, జీవీఎంసీ, వైద్య ఆరోగ్యశాఖ, ఆర్టీసీ, విద్యుత్ శాఖాధికారులతో ఆమె సమావేశమై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పరీక్షల నిర్వహణలో లోటుపాట్లు లేకుండా సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలన్నారు. విద్యుత్ సరఫరా, తాగునీరు, మరుగుదొడ్లు, ఫర్నిచర్, మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఎలక్ష?ట్రనిక్ పరికరాలు అనుమతించరాదన్నారు. పరీక్షల సమయంలో కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలుచేయాలని, కేంద్రాల నుంచి 200 మీటర్ల పరిధిలో జెరాక్స్ దుకాణాలు మూసివేయించాలని ఆదేశించారు. కేంద్రాల వద్ద ప్రథమ చికిత్స సదుపాయాలు, విద్యార్థులు కేంద్రాలకు చేరుకోవడానికి ప్రత్యేక బస్సులు ఏర్పాటుచేయాలని ఆదేశించారు.

## భార్యను హత్య చేసిన భర్తకు యావజ్జీవ జైలు

**చింతపల్లి, పతాకం న్యూస్:** మండలంలోని అన్నవరం పోలీసు స్టేషన్ పరిధి పూతికమెట్ట గ్రామంలో భార్యను హత్య చేసిన భర్తకి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ విశాఖపట్నం జిల్లా న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు తీర్పు ఇచ్చారని స్థానిక సీఐ ఎం. వినోద్‌బాబు తెలిపారు. సీఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని తమ్మంగుల పంచాయతీ పూతికమెట్ట గ్రామానికి చెందిన కొర్ర కోనెతో అదే గ్రామానికి చెందిన కొర్ర రామారావుకి వివాహం జరిగింది. భార్య వివాహేతర సంబంధం పెట్టుకుందని తరచూ మద్యం సేవించి గృహానికి వచ్చి ఆమెను కొట్టేవాడు. 2015 మార్చి 20వ తేదీన పది గంటల సమయంలో రామారావు మద్యం సేవించి వచ్చి భార్య కొనెను కత్తితో దాడి చేసి హత్య చేశాడు. మృతురాలు సోదరుడు మర్రి నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదుతో అన్నవరం ఎస్ఐ జి. ఉమామహేశ్వరరావు కేసు నమోదు చేయగా.. సీఐ రుద్రశేఖర్ దర్యాప్తు చేసి న్యాయస్థానం ఎదుట చార్జి షీటు దాఖలు చేశారు. ఈ కేసు విచారణలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు జీఎస్ఎన్‌వీ ప్రసాదరావు, మట్ట ఖజానారావు, సమిరెడ్డి రామ్మూర్తి నాయుడులు బాధితురాలు తరుపున వాదనలు వినిపించారు. అన్నవరం పోలీసులు సకాలంలో సాక్షులను న్యాయస్థానం ఎదుట హాజరుపర్చడంతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ముద్దాయి రామారావుకు యావజ్జీవకారాగార శిక్షతోపాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారని సీఐ వినోద్‌బాబు తెలిపారు. ఈ కేసును దర్యాప్తు చేసిన పోలీసు అధికారులను ఎస్పీ అమిత్‌బర్దర్, చింతపల్లి ఏఎస్పీ నవజ్యోతి మిశ్రాలు అభినందించారు.

## రైలు నుంచి జారి పడి యువకుడు మృతి

**గజపతినగరం, పతాకం న్యూస్:** విశాఖపట్నం నుంచి పార్వతీపురం వైపు వెళుతున్న పాసింజర్ రైలు నుంచి జారి పడి యువకుడు మృతి చెందాడు. బొబ్బిలి రైల్వే జీఆర్‌పీ హెచ్‌సీ ఈశ్వరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండలం రావుపల్లి గ్రామం చిన్నవీధికి చెందిన పల్ల అప్పలనాయుడు (25)... సింహాచలం నుంచి పార్వతీపురం వెళ్లేందుకు గురువారం సాయంత్రం విశాఖపట్నం - భవానీపట్నం పాసింజర్ రైలు ఎక్కాడు. గజపతినగరం రైల్వే స్టేషన్ దాటిన తరువాత గుడివాడ గ్రామ సమీపంలో దురదృష్టవశాత్తూ రైలు నుంచి జారి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. అందిన సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించినట్లు హెచ్‌సీ తెలిపారు.

## జీడి పిక్కల జీఎస్టీని ఎగవేసిన వ్యాపారులు..




**అనకాపల్లి, పతాకం న్యూస్:** జిల్లాలో జీడి పిక్కల లావాదేవీలకు సంబంధించి వ్యాపారులు జీఎస్టీని ఎగవేస్తున్నారు. ఏటా అరవై కోట్ల రూపాయలకుపైగా వ్యాపారం జరుగుతుండగా, ఐదు శాతం జీఎస్టీ మేరకు మూడు కోట్ల రూపాయల ఆదాయం రావాల్సి వుంది. కానీ రెండు కోట్ల రూపాయలు కూడా రావడంలేదు. జీడి పిక్కల వ్యాపారుల అక్రమాలు, సంబంధిత అధికారులు నిఘా కొరవడడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్నది. జిల్లాలో అనకాపల్లి, అచ్యుతాపురంలో స్టేట్ జీఎస్టీ సర్కిల్ కార్యాలయాలు వున్నాయి. అనకాపల్లి సర్కిల్ పరిధిలో అనకాపల్లి టౌన్‌తోపాటు మండలం, సబ్బవరం, రావికమతం, బుచ్చెయ్యపేట, చోడవరం, కె.కోటపాడు, వి.మాడుగుల, దేవరాపల్లి, చీడికాడ మండలాలు ఉన్నాయి. అచ్యుతాపురం సర్కిల్ పరిధిలో పరవాడ, కశింకోట, రాంబిల్లి, ఎలమంచిలి, మునగపాక, అచ్యుతాపురం, కోటవురట్ల, పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, నర్సీపట్నం, నాతవరం, గొలుగొండ, మాకవరపాలెం, రోలుగుంట మండలాలు వున్నాయి. అచ్యుతాపురం సర్కిల్ పరిధిలో జీడి పిక్కల లావాదేవీలు అధికంగా జరుగుతుంటాయి. నర్సీపట్నం, రోలుగుంట, రావికమతం మండలాల్లో జీడి పిక్కల ప్రాసెసింగ్ (జీడి పప్పు తయారీ) యూనిట్లు ఉన్నాయి. వ్యాపారులు (దళారులు) రైతుల నుంచి జీడి పిక్కలు కొనుగోలు చేసి ప్రాసెసింగ్ యూనిట్లకు విక్రయిస్తుంటారు. ఈ క్రమంలో రైతుల నుంచి కొనుగోలు చేసిన జీడి పిక్కల విలువపై ఐదు శాతం జీఎస్టీ చెల్లించాలి. జిల్లాలో ఏటా రూ.60 కోట్ల వరకు వ్యాపారం జరుగుతుంటుందని అంచనా. దీనిపై ఐదు శాతం చొప్పున రూ.3 కోట్లు ప్రభుత్వ ఖజానాకు జమకావాలి. కానీ అధికారుల ఉదాసీనత కారణంగా రూ.1.8 కోట్లకు మించి జీఎస్టీ వసూలు కావడం లేదు. జీడి పిక్కల లావాదేవీలకు సంబంధించిన రికార్డుల నిర్వహణలో వ్యాపారులు మాయాజాలాన్ని ప్రదర్శిస్తున్నారు. రైతుల నుంచి కొనుగోలు చేస్తున్న జీడి పిక్కల పరిమాణంలో సగం మాత్రమే లెక్కల్లో చూపుతున్నారు. కొంతమంది వ్యాపారులు ట్రేడ్ లైసెన్సు లేకుండా అనధికారికంగా జీడి పిక్కల వ్యాపారం చేస్తున్నారు. అధికారులు కార్యాలయానికే పరిమితం కావడం, క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టకపోవడంతో ఇటువంటి అక్రమాలు యథేచ్ఛగా సాగిపోతున్నాయి. ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్నది. కొంతమంది వ్యాపారులు జీడి పిక్కలను కొనుగోలు చేసేటప్పుడు జీఎస్టీ పేరుతో రైతులకు చెల్లించాల్సిన సొమ్ము నుంచి ఐదు శాతాన్ని మినహాయించుకుంటున్నట్టు తెలిసింది.

## గడువులోగా అర్జీలను పరిష్కరించాలి



**పాడేరు, పతాకం న్యూస్:** మీకోసంలో వచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి గడువులోగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ అధికారులను ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ(మీకోసం)కార్యక్రమంలో ఆమెప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ప్రజల సమస్యలను పరిష్కరించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న మీకోసం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పీజీఆర్ఎస్ సేవలపై ఐవీఆర్ఎస్ ద్వారా ప్రభుత్వ ప్రజాభిప్రాయాలను సేకరిస్తున్నదని, ఈక్రమంలో అధికారులు పీజీఆర్ఎస్‌పై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్రీపూజ, ఐటీడీఏ పీవో ఆదిత్యవర్మ గిరిజనుల నుంచి 33 వినతులను స్వీకరించారు. మీకోసంలో సమర్పించిన అర్జీలపై తాజా స్థితిగతులను తెలుసుకునే ందుకు ప్రజలు 1100 నంబర్ కాల్ సెంటర్‌ను వినియోగించుకోవాలని జేసీ శ్రీపూజ సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో ఎంవీఎస్.లోకేశ్వరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నీలకంఠరావు, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.మురళీ, డీఎంహెచ్‌వో కృష్ణమూర్తినాయిక్, డీఈవో రామకృష్ణారావు, గిరిజన సంక్షేమ శాఖ డీడీ పరిమిళ, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్.నందు, జిల్లా ఉద్యానవనాధికారి కె.బాలకర్ణ, హౌసింగ్ పీడీ బి.బాబు, డీపీవో చంద్రశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ వీబీ.నాగేశ్వరరావు, జిల్లా టూరిజం ఆఫీసర్ జి.దాసు, డీఎల్‌పీవో పీఎస్.కుమార్, ఐసీడీఎస్ పీడీ ఝాన్సీబాయి, సీపీవో ప్రసాద్, ఐటీడీఏ ఏపీవో ఎం.వెంకటేశ్వరరావు, సబ్‌కలెక్టర్ కార్యాలయం డీటీ వి.ధర్మరాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 'శాంక్టమ్' తొలగింపుపై స్టే

**విశాఖపట్నం, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ)కు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. తొట్లకొండలో కోస్తా నియంత్రణ మండలి (సీఆర్‌జెడ్) నిబంధనలు ఉల్లంఘించి శాంక్టమ్ రెస్టారెంట్ పేరుతో చేపట్టిన నిర్మాణాలన్నింటినీ కూల్చేయాలని గత నెల 23న హైకోర్టు తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. కాపులుప్పాడ సర్వే నంబర్ 314లోని 2.4 ఎకరాల విస్తీర్ణంలో ఏపీటీడీసీ రెస్టారెంట్ నిర్మించి లీజుకు ఇచ్చింది. దానిని ఆ వ్యక్తి వైసీపీ నాయకులకు సబ్ లీజుకు ఇచ్చారు. వారు అధికారంలో ఉన్నప్పుడు సీఆర్‌జెడ్ నిబంధనలు ఉల్లంఘించి ఇష్టానుసారం పక్కా నిర్మాణాలు చేపట్టారు. అనుమతులు తీసుకోలేదు. దీనిపై విశాఖపట్నం ఫిషర్ విమెన్ డ్రై ఫిష్ కో-ఆపరేటివ్ సొసైటీ హైకోర్టులో కేసు వేసింది. ఆ తరువాత అక్కడ అక్రమాలు కూడా జరుగుతున్నాయని జనసేన నాయకుడు పీతల మూర్తి యాదవ్ కేసు వేశారు. అనధికార నిర్మాణాలు తొలగించాలని జీవీఎంసీ అధికారులు సూచించారు. అయితే ఏపీటీడీసీ ప్రభుత్వ కార్పొరేషన్ అని, నిబంధనలకు తమకు వర్తించవని హైకోర్టులో అధికారులు వాదించారు. దానిపై న్యాయస్థానం సీరియస్ అయింది. చట్టం ముందు అంతా సమానమేనని, అక్రమ నిర్మాణాలను ఉత్తర్వులు అందిన మూడు వారాల్లో తొలగించాలంటూ గత నెల 23న తీర్పు ఇచ్చింది. ఇది ఏటీడీడీసీకి మింగుడు పడలేదు. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ, నిర్మాణాలను తొలగించకుండా స్టే ఇవ్వాలని సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అక్కడ కేసును స్వీకరిస్తూ, వచ్చే విచారణ వరకు నిర్మాణాలను తలొగించవద్దని పేర్కొంటూ స్టే ఇచ్చినట్టు ఏపీటీడీసీ వర్గాలు తెలిపాయి.

# తమిళనాడులో కృత్రిమ సంక్షోభం: భారత మాజీ అటార్నీ జనరల్ ముకుల్ రోహత్గి




**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ప్రభుత్వం ఏర్పాటు విషయంలో తమిళనాడులో కొనసాగుతున్న ప్రతిష్టంభనను 'కృత్రిమ సంక్షోభం'గా సీనియర్ అడ్వకేట్, భారత మాజీ అటార్నీ జనరల్ ముకుల్ రోహత్గి అభివర్ణించారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సిందిగా టీవీకే చీఫ్ విజయ్‌ను గవర్నర్ ఆహ్వానించి ఉండాల్సిందని అన్నారు. తమిళనాడులోని రాజకీయ పరిస్థితిపై ఆయన ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, ఇది రాజ్యాంగ సంక్షోభం పరిస్థితి కాదని, కృత్రిమ సంక్షోభమని చెప్పారు. మెజారిటీ మార్క్‌ను టీవీకే సాధించనప్పటికీ ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సిందిగా ఫలితాలు వెలువడిన మొదటిరోజునే విజయ్‌ను గవర్నర్ కోరాల్సిందని రోహత్గి అభిప్రాయం వ్యక్తం చేశారు. 'మ్యాజిక్ నంబర్‌ను ఆయన సాధించి ఉండకపోవచ్చు. అదేమంత విషయం కాదు. రాజ్యాంగ సంప్రదాయాలకు ప్రకారం అతిపెద్ద పార్టీ నేతను ఆహ్వానించవచ్చు. ఒకటి రెండు వారాల్లో మద్దతు కూడగట్టుకుని స్థిరమైన ప్రభుత్వం ఏర్పాటుకు అనుమతించ వచ్చు. సభలో మెజారిటీ నిరూపించుకునే అవకాశం కల్పించవచ్చు. సంఖ్యాబలం తక్కువగా ఉన్నా తగినంత బలం కూడగట్టుకుని ప్రభుత్వం కొనసాగించిన దాఖలాలు గతంలో కూడా ఉన్నాయి' అని రోహత్గి చెప్పారు. విశ్వాస పరీక్ష సమయంలో ఇతర పార్టీలు గైర్హాజరయినప్పుడు మైనారిటీ ప్రభుత్వం మనగడ సాగిస్తుందని మాజీ ప్రధాని పీవీ నరసింహారావు గతంలో చెప్పిన విషయాన్ని కూడా రోహత్గి ప్రస్తావించారు. 'మెజారిటీ మార్క్ 118 కావచ్చు, మరొకటి కావచ్చు. సంఖ్యాబలం చూపించమని పట్టుబట్టడం ద్వారా గవర్నర్ రాజ్యాంగ సంక్షోభాన్ని సృష్టిస్తుండటమే ఇప్పుడున్న అసలు సమస్య. ఇది పూర్తిగా తప్పు. బల నిరూపణ అసెంబ్లీలోనే కానీ, లోక్‌భవన్‌లో కాదు' అని రోహత్గి స్పష్టం చేశారు. అతి పెద్ద ఎన్నికల ప్రక్రియ అనంతరం కూడా మళ్లీ ఎన్నికలు జరపడం, రాష్ట్రపతి పాలన విధించడం ఎంతమాత్రం సరికాదని రోహత్గి అన్నారు. ఎన్నికల కోసం వేలాది కోట్ల రూపాయలు ఖర్చయ్యాయని, ఎంతో సిబ్బంది, ఎన్నో గంటలు వెచ్చించారని చెప్పారు. ఒక వ్యక్తికి 108 లేదా 110 సీట్లు వచ్చాయంటూ ప్రభుత్వం ఏర్పాటుకు అవకాశం ఇవ్వకపోవడం ఎప్పుడూ జరగలేదని అన్నారు. తమిళనాడు ఎన్నికల్లో టీవీకే 108 సీట్లు గెలిచినప్పటికీ మెజారిటీ మార్క్‌కు అవసరమైన 118 సీట్లు సాధించలేకపోయారు. తగినంత మద్దతు కూడగట్టే విషయంలో ప్రస్తుతం అనిశ్చితి కొనసాగుతోంది.

## ముకుందపురం-కేరాశింగి-గూడ రోడ్డుకు మోక్షం ఎప్పుడూ?



**మెళియాపుట్టి, పతాకం న్యూస్:** ముకుందపురం-కేరాశింగి-గూడ రోడ్డుకు మోక్షం కలగడం లేదు. సంవత్సరాలు గడుస్తున్నా ఈ రోడ్డు పనులు పూర్తికావడం లేదు. ఏదో ఒక రూపంలో ఆటంకం కలుగుతుంది. ప్రతి ఏడాది నిధులు మంజూరు చేస్తున్నా పనులు మాత్రం పూర్తి కావడం లేదు. దీంతో గిరిజనులకు ఇబ్బందులు తప్పడం లేదు. 2014లో టీడీపీ ప్రభుత్వంలో ఈ రోడ్డు నిర్మాణానికి అడుగులు పడ్డాయి. కొండ దిగువన ఉన్న ముకుందపురంనుంచి కొండ ఎగువన ఉన్న కేరాశింగి, గూడ వరకు ఆరు కిలోమీటర్ల రహదారి పనులు ప్రారంభించారు. కొంత వరకు మట్టి పనులు జరిగాయి. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వంలో పనులు చేయకుండా బిల్లులు కాజేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై గిరిజనుల నుంచి ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కొంత వరకు పనులు జరిగాయి. అయితే, బిల్లులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్ పనులను మధ్యలో వదిలేశాడు. ఇటీవల కురిసిన వర్షాలకు మెటల్‌తో పాటు రాయిపిండి (క్రషర్ బుగ్గి) కొట్టుకుపోవడంతో రోడ్డు ప్రమాదకరంగా మారింది. దీంతో పనులు మళ్లీ మొదటికి వచ్చాయని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వం నుంచి ఇప్పటి కూటమి సర్కారు వరకు ఈ రోడ్డు కోసం రూ.3.95కోట్లు ఖర్చు చేశారు. అయినా పనులు మాత్రం పూర్తి కావడం లేదు. ప్రస్తుతం ఈ మార్గంలో పెద్దపెద్ద రాళ్లు తేలి ఉన్నాయి. కొంతమంది ఆటో డ్రైవర్లు ధైర్యం చేసి ప్రయాణికులను కొండ పైకి తీసుకెళుతున్నారు. దిగేటప్పుడు ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా లోయలో పడిపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా పనులు పూర్తి చేయాలని గిరిజనులు కోరుతున్నారు

## స్వచ్ఛరథం ప్రాజెక్టు విజయవంతం




**బూర్జ, పతాకం న్యూస్:** నిరుపయోగంగా ఉన్న ప్లాస్టిక్, పాత పేపర్లు ఇతర వస్తువులను సేకరించి వాటికి బదులుగా నిత్యావసరాలను అందించేందుకు ఉద్దేశించిన 'స్వచ్ఛరథం' ప్రాజెక్టు విజయవంతం అయిందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అసిస్టెంట్ కమిషనర్ బి.హర్ష అన్నారు. లక్కుపురం, పాలవలస సచివాలయం పరిధిలో ఈ ప్రాజెక్టు పనితీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లా దుతూ.. ఇళ్లలో ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను సంపదగా మార్చే ఉద్దేశంతో దీనిని ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని, తద్వారా గ్రామాలు పరిశుభ్రంగా ఉండడంతో పాటు నిత్యావసర వస్తువులు పొందవచ్చన్నారు. దీని సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. ఈ వాహన సిబ్బంది పాత ఇనుము, పేపర్లు, పుస్తకాలు, అట్ట పెట్టెలు, ప్లాస్టిక్ బాటిళ్లు, స్టీల్ వస్తువులను సేకరించి వాటికి బదులుగా ఉప్పు, పప్పు, చింతపండు, సబ్బులు వంటి నిత్యా వసర వస్తువులు అందజేస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో తిరుపతి రావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## భారత నౌకాదళ తదుపరి అధిపతిగా వైస్ అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్




**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** భారత నౌకాదళ తదుపరి అధిపతిగా వైస్ అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్‌ను కేంద్ర ప్రభుత్వం నియమించింది. ప్రస్తుత నావికాదళ చీఫ్ అడ్మిరల్ దినేశ్ కుమార్ త్రిపాఠి స్థానంలో స్వామినాథన్ బాధ్యతలు స్వీకరించనున్నారు. 31 మే 2026న దినేశ్ కుమార్ త్రిపాఠి పదవీ విరమణ చేయనున్నారు. అనంతరం అదే రోజున కృష్ణ స్వామినాథన్ బాధ్యతలు స్వీకరించనున్నారు. 31 డిసెంబర్ 2028 వరకు ఆయన పదవిలో కొనసాగనున్నారు. ప్రస్తుతం ముంబైలోని పశ్చిమ నావికాదళ కమాండ్‌కు ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్‌గా పనిచేస్తున్నారు. భారత నావికాదళంలో స్వామినాథన్ 1987 జులై 1న చేరారు. తన సేవా కాలంలో కమ్యూనికేషన్, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్‌లో నైపుణ్యం సాధించి అనేక కీలక పదవులను నిర్వర్తించారు. ఖడక్‌వాస్లాలోని నేషనల్ డిఫెన్స్ అకాడమీ, యునైటెడ్ కింగ్‌డమ్‌లోని ష్రివెన్‌హామ్‌లో ఉన్న జాయింట్ సర్వీసెస్ కమాండ్ అండ్ స్టాఫ్ కాలేజ్, కరంజాలోని కాలేజ్ ఆఫ్ నావల్ వార్‌ఫేర్, రోడ్ ఐలాండ్‌లోని న్యూపోర్ట్‌లో ఉన్న యునైటెడ్ స్టేట్స్ నావల్ వార్ కాలేజీలో స్వామినాథన్ విద్యను అభ్యసించారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ భారత రక్షణ శాఖ ఎక్స్ వేదికగా పోస్టు చేసింది.

## కారులో గ్యాస్ నింపుతుండగా పేలుడు.. 3 వాహనాలు దగ్ధం



**కామారెడ్డి, పతాకం న్యూస్:** కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి గ్రామంలో ఓ కారులో గ్యాస్ నింపుతుండగా ఒక్కసారిగా ట్యాంకు పేలింది. ఈ ప్రమాదంలో కారు పక్కన పార్కింగ్ చేసి ఉన్న మరో రెండు కార్లు, బైకులు దగ్ధమయ్యాయి. పేలుడు ధాటికి భారీ శబ్దం రావడంతో స్థానికులు భయంతో పరుగులు తీశారు. ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపు చేశారు.

## సీఎం పర్యటనను విజయవంతం చేయాలి



**నరసన్నపేట, పతాకం న్యూస్:** ముఖ్యమంతి చంద్రబాబు ఈనెల 16న నరసన్నపేట పట్టణంలో పర్యటన నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా వ్యవహారించి అన్ని ఏర్పాట్లు పక్కాగా పూర్తిచేయాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అధికారులను సూచించారు. స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లాలో వివిధ శాఖల అ?ధికారులతో సమీక్షించారు. నరసన్నపేట మేజర్ పంచాయతీ పరిధిలో పారిశుధ్యం, రహదారుల మరమ్మతులు, విద్యుత్ అలంకరణలు, తాగునీటి సౌకర్యాలు వంటి పనులు వేగవంతంగా చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలు ఎదురైతే వెంటనే ఎంపీడీవోను సంప్రదించి పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ కార్యనిర్వహక కార్యదర్శి బగ్గు అర్చన, జెడ్పీ సీఈవో ఆర్.వెంకట్రామన్, డీపీవో స్వరూపరాణి, డీఎల్‌పీవో గోపిబాల తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్



**పాతపట్నం, పతాకం న్యూస్:** నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల పరి ష్కారానికే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. ఈ మేరకుతన క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. బోరుభద్ర-శివరాంపురం గ్రామాల మధ్య బీటీ రోడ్ నిర్మించాలని బోరుభద్ర మాజీ సర్పంచ్, మాజీ వైస్‌సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామస్థులు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. రోడ్‌కు ఇరువైపులా రక్షణగోడ నిర్మించాలని గ్రామంలోగల ఎర్రచెరువు, కంసాలి చెరువులకు మెట్లు మంజూరీ చేయాలని కోరారు. పేదలు, సన్నకారు రైతులకు చెందిన బూరగాంలోని షుగర్ ఫ్యాక్టరీ భూములకు అక్రమంగా మ్యుటేషన్ చేయించి కొంతమంది కాజేయాలని చూస్తున్నారని, దీనిని అడ్డుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆ గ్రామస్థులు కోరారు. వీటితోపాటు వివిధ సమ స్యలపై 45 వినతులు అందాయి. అనంతరం పార్టీ శ్రేణులతో సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీఎల్‌ఏలను నియమించుకోండి



**బొబ్బిలి, పతాకం న్యూస్:** ప్రతి పోలింగ్ కేంద్రానికి బూత్ లెవెల్ ఏజెంట్ (బీఎల్ఏ)ను రాజకీయ పార్టీలు తప్పనిసరిగా నియమించుకో వాలని ఆర్డీవో రామ్మోహనరావు కోరారు. భార త ఎన్నికల సంఘం, జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ఆదేశాల మేరకు బొబ్బిలి ఆర్డీవో కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ని యోజకవర్గంలో 264 పోలింగ్ కేంద్రాలకు సం బంధించి పార్టీల వారిగా బీఎల్‌ఏల జాబితా ను రెండు రోజుల్లో సమర్పించాలని సూచించా రు. పోలింగ్ కేంద్రాలు శిథిలావస్థలో ఉంటే సమీపంలో నూతన భవనాల్లోకి మార్పుచేసే చర్యలు తీసుకుంటా మని తెలిపారు. కేంద్రాలపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే రాజకీయ పార్టీలు తెలి యజేయాలన్నారు. అనంతరం పోలింగ్ కేంద్రాల్లో బేసిక్ మినిమం ఫెసిలిటీ (బీఎం ఎఫ్) కల్పనపై సమీక్షించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సార్) ప్రీ రివిజన్ కార్యక్రమంలో భాగంగా 2002-2025 ఓటర్ జాబితాల మధ్య కామన్ ఓటర్ల ఆన్‌లైన్ మ్యాపింగ్‌ను బీఎల్వోల ద్వారా వందశాతం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఓటర్ల జాబితాలో డబుల్ ఎంట్రీలు, బ్లర్ ఇమేజస్, డెమోగ్రాఫికల్ తప్పులు వంటి సమస్యలు ఫారం-8 ద్వారా సరిచేసుకునే అవకాశం ఉందన్నారు. అలాగే కొత్త ఓటర్ల చేర్పులు, మార్పులు, మరణించిన వారి ఓట్లు తొలగింపు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందన్నారు.

## తొలగించిన పారిశుధ్య కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



**అరసవల్లి, పతాకం న్యూస్:** ఎటువంటి ముందస్తు నోటీ సులివ్వకుండా విధుల నుంచి తొలగించిన 23 మంది రిమ్స్ ఆసుపత్రి పారిశుధ్య కార్మికులను తక్షణం విధుల్లోకి తీసుకోవాలని ఇఫ్టూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు రిమ్స్ కాలేజీ ప్రిన్సిపాల్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.లుక లాపు ప్రసన్నకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీవో ప్రకారం వేతనాలు చెల్లించాలని కోరినందుకు కార్మికులను విధుల నుంచి తప్పిం చడం ఎంతమాత్రం సరికాదన్నారు. దీనికి సంబంధించి తక్షణ మే కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని లేబర్ కోర్డు కూడా ఆదేశించిందన్నారు. అక్టోబరు నుంచి ఏప్రిల్ వరకు చెల్లించా ల్సిన వేతనాలను విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు సవలాపురపు కృష్ణవేణి, సాధు శ్రీనివాస్, డి.చిన్నారావు, కొప్పుల భాస్కరరావు, కొప్పుల నీలవేణి తదితరులు పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టంతో ప్రభుత్వ సేవల్లో నాణ్యత




**విజయనగరం, పతాకం న్యూస్:** ప్రభుత్వ కార్యాలయాల్లో పాదర్శకత, జవా బుదారీతనం, ప్రజా సేవల నాణ్యతను పెం పొందించడంలో ఆర్‌టీఐ చట్టం కీలక పాత్ర పోషిస్తుందని జిల్లా విద్యాశాఖ అధికారి యు.మాణిక్యంనాయుడు తెలిపారు. పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టం(ఆర్‌టీఐ)పై జిల్లా ఉప విద్యాశా ఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి అధికారి ప్రజలకు సమయానుకూలంగా, సరైన సమాచారాన్ని అందించే విధంగా బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. విద్యా శాఖలో ప్రజా సేవలను మరింత సమర్ధవంతంగా అందించేందుకు అధికారులు కృషి చేయాల న్నారు. స్టేట్ రిసోర్స్‌పర్సన్ ప్రొఫెసర్ విష్ణుమూ ర్తి ఆర్‌టీఐ చట్టంలోని ముఖ్యాంశా లను వివ రించారు. సమాచార హక్కు చట్టం ప్రకారం పౌరులకు ఉన్న హక్కులు, ప్రభుత్వ కార్యాల యాల బాధ్యతలను వివరించారు. సమాచారా న్ని నిర్దిష్ట గడువులోగా అందించాల్సిన అవస రం ఉందని చెప్పారు అసిస్టెంట్ డైరెక్టర్ అరుణ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## కేరళ సీఎం అభ్యర్థిపై కొనసాగుతున్న ఉత్కంఠ



**కేరళ, పతాకం న్యూస్:** కేరళ సీఎం ఎవరవుతారే విషయంలో ఉత్కంఠ కొనసాగుతోంది. కేరళ కాంగ్రెస్ ముఖ్యమంత్రి ఎంపిక పంచాయతీ ప్రస్తుతం ఢిల్లీకి చేరింది. ముఖ్యమంత్రి ఎవరనేది తేల్చేందుకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో కీలక సమావేశం ప్రారంభమైంది. ఈ సమావేశానికి రాహుల్ గాంధీ కూడా హాజరయ్యారు. ప్రస్తుతం కేరళ సీఎం రేసులో వీడీ సతీశన్, రమేష్ చిన్నితలా, కేసీ వేణుగోపాల్ ఉన్నారు. ఇక ఖర్గే నివాసానికి కేరళ కాంగ్రెస్ ముఖ్యనేతలు కూడా చేరుకున్నారు. ఇప్పటికే ఈ విషయమై ఎమ్మెల్యేల అభిప్రాయాన్ని పరిశీలకులు సేకరించారు. అనంతరం, ఎమ్మెల్యేల అభిప్రాయాలపై అధిష్టానానికి నివేదిక ఇచ్చారు.ఈ నేపథ్యంలో కేరళలో కీలకమైన నేతలతో చర్చించిన అనంతరం ఏఐసీసీ నిర్ణయం తీసుకోనున్నట్టు తెలుస్తోంది. కేరళ సీఎం ఎవరనే దానిపై ఈరోజు సాయంత్రానికి ఒక స్పష్టత వచ్చే అవకాశం ఉన్నట్టు సమాచారం. ఇదిలా ఉంటే.. సతీశన్, రమేశ్ చిన్నితలా, కేసీ వేణుగోపాల్‌కు మద్దతుగా రాష్ట్రంలో వారి మద్దతుదారులు ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. ర్యాలీలు నిర్వహించడంతో పాటు అనేక ప్రాంతాల్లో తమ ప్రియతమ నాయకుల బిల్‌బోర్డులు, పోస్టర్లు ఏర్పాటు చేశారు.

## కార్తికేయ ప్రైడ్ హోటల్ సీసీ ఫుటేజీని సీజ్ చేయండి



**అమరావతి, పతాకం న్యూస్:** విజయవాడ, పటమట పోలీసులు కార్తికేయ ప్రైడ్ హోటల్‌ను కేంద్రంగా చేసుకుని చేసే దందాలపై సిబిఐ దర్యాప్తునకు ఆదేశించాలంటూ పల్నాడు జిల్లా, అందుకూరు గ్రామానికి చెందిన కర్నాటి వీరభద్రరావు దాఖలు చేసిన పిల్‌ను విచారించిన హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. పిటిషనర్ చేసినవి తీవ్ర అభియోగాలు కాబట్టి హోటల్ సిసిటివి ఫుటేజీ మొత్తాన్ని భద్రపరచాలని పటమట పోలీసులను ఆదేశించింది. అదే విధంగా పోలీస్ స్టేషన్ సిసి కెమెరాల ఫుటేజీని సైతం భద్రపర్చాలని ఆదేశించింది. ఈ మేరకు చీఫ్ జస్టిస్ లీసా గిల్, జస్టిస్ నైనాల జయసూర్యతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఆదేశించింది. వ్యక్తులను హోటల్‌కు పోలీసులు బలవంతంగా తీసుకెళ్లి నిర్బంధించడం, బెదిరించడం, ఖాళీ స్టాంప్ పేపర్లపై సంతకాలు చేయించుకుని సివిల్, ఆస్తి వివాదాల బలవంతపు రాజీలకు పాల్పడుతున్నారని పిల్‌లో పిటిషనర్ ఆరోపించారు. అనుమతి లేకుండా డిజిటల్ సర్వైలెన్స్ చేస్తున్నారని కూడా పేర్కొన్నారు. పటమట పిఎస్ పరిధిలోని కార్తికేయ ప్రైడ్ హోటల్‌ను పోలీసులు అనధికార అడ్డా చేసుకుని దారుణాలకు పాల్పడుతున్నారంటూ పిటిషనర్ న్యాయవాది పి మల్లికార్జునరావు వాదించారు. కార్తికేయ ప్రైడ్ హోటల్లో పోలీసుల దందాలన్నీ విజయవాడ అదనపు డిప్యూటీ కమిషనర్ ఎన్‌టిఎం మురళీకృష్ణ, పటమట సిఐ పవన్‌ల ఆధ్వర్యంలో జరుగుతున్నాయన్నారు. పిటిషనర్ వీరభద్రరావును సైతం పోలీసులు అదే హోటల్‌కు బలవంతంగా తీసుకెళ్లి తెల్లకాగితాలపై సంతకాలు చేయించుకున్నారని చెప్పారు. హోటల్ సిసిటివి ఫుటేజీని భద్రపరిచేలా ఉత్తర్వులివ్వాలని కోరారు. దీనిపై ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది టి విష్ణుతేజ స్పందిస్తూ, ఇది పిల్ కాదని, పిటిషన్ వేసుకోవాలన్నారు. పటమట పోలీసులపై చర్యలు తీసుకోవాలని పిటిషనర్ ఇచ్చిన వినతిపత్రంపై నిర్ణయం తీసుకోవాల్సి వుందన్నారు. వాదనలపై జోక్యం చేసుకున్న డివిజన్ బెంచ్, పిటిషనర్‌ను మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చినప్పుడు కూడా ఇవే విషయాలను అక్కడ చెప్పారని గుర్తు చేసింది. విచారణను వాయిదా వేసింది.

## 'ఉపాధి' పని దినాలు తగ్గడంపై చంద్రబాబు ఆరా.!



**అమరావతి, పతాకం న్యూస్:** 'ఉపాధి హామీ' పథకంలో ఎప్రిల్ నెలలో రాష్ట్రానికి కేటాయించిన పని దినాలను ఆశించిన స్థాయిలో వినియోగించుకోలేకపోవడానికి కారణాలను తెలియజేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆ శాఖ అధికారులను ప్రశ్నించారు. కలెక్టర్ల సదస్సులో భాగంగా రెండవ రోజైన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర పథకాలకు సంబంధించి వీలైనంత వరకూ ఎక్కువగా వినియోగించుకునేందుకు ప్రయత్నం చేయాలన్నారు. వేతనదారులకు ఉపాధి కల్పనలో వెనుకబాటుకు కారణాలను అడిగారు. ముఖ ఆధారిత హాజరు యాప్ సరిగ్గా పనిచేయని కారణంగా అధిక సంఖ్యలో పని దినాల కల్పనలో సమస్యలు ఉత్పన్నమైనట్లు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ.. ముఖ్యమంత్రికి తెలియజేశారు. ఏప్రిల్ మొదటి వారంలో ఈ సమస్య వల్ల 60 లక్షల పని దినాలు కల్పించకపోయామని, ఈ అంశంపై కేంద్రానికి విన్నవించి, సాంకేతిక నిపుణులను రప్పించి పరిస్థితులను చక్కదిద్దినట్లు చెప్పారు. ప్రస్తుతం దేశంలో 50 లక్షల మంది ఈ పథకంలో పని చేస్తుంటే రాష్ట్రంలో 20 లక్షల మంది ఉన్నట్లు వెల్లడించారు. ఆ శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ మాట్లాడుతూ.. గత నెలలో దేశంలోనే అత్యధిక పని దినాలు కల్పన రాష్ట్రంలోనే జరిగిందన్నారు. 3.42 కోట్ల పని దినాలు కల్పించినట్లు వెల్లడించారు. దేశంలోనే 39.01 శాతం పని దినాలను వినియోగించుకుని ప్రథమ స్థానంలో రాష్ట్రం నిలిచినట్లు పేర్కొన్నారు. మే నెలలో 100 శాతం వినియోగించుకుంటారా అని అధికారులను ముఖ్యమంత్రి ప్రశ్నించారు. వినియోగించుకోనున్నట్లు అధికారులు సమాధానం ఇచ్చారు. విబి గ్రామ్ జి పథకం నిబంధనల్లో కేంద్ర ప్రభుత్వం చేసిన మార్పుల వల్ల కొన్ని సమస్యలు ఉత్పన్నమైనట్లు వెల్లడించారు.

## మహిళా స్వయం సహాయక సంఘాలకు శుభవార్త




**హైదరాబాద్, పతాకం న్యూస్:** మహిళా సంఘాల ఆర్థిక సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు అర్హత కలిగిన ఎస్‌హెచ్‌జీలకు అందిస్తున్న రూ.5లక్షల వడ్డీలేని రుణాల పరిమితిని రూ.10 లక్షలకు పెంచింది. రూ.10లక్షల వరకు మహిళా సంఘాలు తీసుకునే బ్యాంకు రుణాలకు సంబంధించిన వడ్డీ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుంది. మహిళలపై ఆర్థిక భారాన్ని తగ్గించడమే లక్ష్యంగా వారు తీసుకునే రుణాలపై వడ్డీ భారం తగ్గించేందుకు ప్రభుత్వం ఈ ఏడాది రూ.2500 కోట్లను ఖర్చు చేయనున్నట్లు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనుసూయ సీతక్క తెలిపారు. ఈ ఏడాది మహిళా సంఘాలకు రూ.26,621.47కోట్ల రుణ సదుపాయం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. మహిళల ఆర్థిక ప్రగతికి అండగా నిలుస్తూ 4.33 లక్షల సంఘాలకు ఈ ఏడాది రుణాలు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికను రూపొందించింది. గ్రామీణ ప్రాంతాల్లోని 3.90 లక్షల సంఘాలకు రూ.20,536 కోట్లు, పట్టణ ప్రాంతాల్లోని 43,307 సంఘాలకు రూ.6,085 కోట్లు కలిపి మొత్తం రూ.26,621.47 కోట్ల రుణాలను బ్యాంకుల ద్వారా ఇవ్వాలని నిర్ణయించారు.

# వాహనాల రద్దీకి టెక్నాలజీతో చెక్..
# 'ఈ-పాత్' యాప్‌తో సాఫీగా ప్రయాణం



**విజయవాడ, పతాకం న్యూస్:** సాధారణంగా వీవీఐపీలు రోడ్డుపై వెళుతున్నారంటే సిగ్నల్ వద్ద గంటల కొద్దీ రోడ్డుపై వాహనాలు బారులు తీరాల్సి వస్తుంది. దీన్ని దృష్టిలో ఉంచుకున్న విజయవాడ పోలీసులు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వాహనదారుల కష్టాలకు చెక్ పెడుతున్నారు. వీవీఐపీలకు, అంబులెన్స్‌లకు సిగ్నల్ వద్ద గ్రీన్ ఛానెల్ ఇచ్చేందుకు ఈ-పాత్ అనే నూతన యాప్‌ను రూపొందిస్తున్నారు. దీనికి సంబంధించి త్వరలోనే ఈ-పాత్ యాప్?ను అందుబాటులోకి తెచ్చేందుకు పోలీసులు కసరత్తు చేస్తున్నారు. సీఎం, గవర్నర్ లాంటి హై ప్రొటోకాల్ ఉన్న వ్యక్తులు ఎక్కడ నుంచి ఎక్కడకు వెళు తున్నారు? ఎప్పుడు వెళుతున్నారు? అనే సమాచారాన్ని యాప్‌లో అప్‌లోడ్ చేస్తే క్షణాల్లో గ్రీన్ ఛానెల్ ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు. అసలు ఈ పాత్ యాప్ పని చేస్తుందో ఇప్పుడు తెలుసుకుందాం. వీఐపీలు రోడ్డుపైకి వస్తే వెంటనే ట్రాఫిక్‌ను నిలిపేస్తారు. దీంతో సిగ్నల్స్ వద్ద గంటల కొద్దీ వాహనదారులు నిరీక్షించాల్సి వస్తుంది. దీన్ని అధిగమించేందుకు బెజవాడ పోలీసులు టెక్నాలజీని వినియోగించనున్నారు. ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తెచ్చి ట్రాఫిక్ సిగ్నల్ వద్ద గ్రీన్ ఛానల్‌ను అమలు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ప్రొటోకాల్ ప్రకారం వీవీఐపీలు సీఎం, గవర్నర్, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి లాంటి వ్యక్తులు రోడ్డు మార్గంలో వెళ్లేటప్పుడు వారికి గ్రీన్ ఛానల్ ఇస్తారు. నగరంలో వారు వెళ్లే దారిలో ఉన్న అన్ని సిగ్నల్ వద్ద ట్రాఫిక్‌ను నిలుపుతారు. వీవీఐపీలు వచ్చే కొద్దిసేపు ముందు ట్రాఫిక్ పోలీసులు హ్యాండ్ సెట్‌లో కమాండ్ ఇస్తూ ట్రాఫిక్‌ను నియంత్రిస్తారు. దీంతో ఎక్కువ సేపు వాహనదారులు సిగ్నల్స్ వద్ద నిరీక్షించాల్సి వస్తుంది. అయితే దీనికి పోలీసులు టెక్నాలజీతో చెక్ పెట్టనున్నారు. ఈ పాత్ అనే యాప్ తయారు చేస్తున్నారు.

త్వరలోనే ఇది అందుబాటులోకి రానుందని ఎన్టీఆర్ జిల్లా సీపీ రాజశేఖరబాబు చెపుతున్నారు. ఈ-పాత్ యాప్‌లో సదరు వీవీఐపీ ఎక్కడ నుంచి ఎక్కడకు వెళు తున్నారు ? ఎప్పుడు వెళుతున్నారు ? వాహన నెంబర్ అన్నీ విషయాలు యాప్‌లో సమగ్రంగా పొందుపరుస్తారు. దాంతో కేవలం మూడు నిమిషాల్లో సమాచారం ట్రాఫిక్ పోలీసులకు చేరుతుంది. వీవీఐపీ వాహనం ట్రాఫిక్ సిగ్నల్ వద్దకు చేరుకోగానే ఆటోమేటిక్‌గా గ్రీన్ సిగ్నల్ వస్తుంది. దీంతో నగరంలో వాహనదారులకు ఇబ్బంది లేకుండా ట్రాఫిక్‌ను నియంత్రించవచ్చని సీపీ చెపుతున్నారు. ప్రస్తుతం హ్యాండ్ సెట్‌లోనే అధికారులకు సమాచారం ఇస్తున్నామని త్వరలోనే ఈ పాత్ యాప్ అందుబాటులోకి వస్తుందని తెలిపారు.

"వీవీఐపీలు వచ్చినపుడు మాత్రమే కాకుండా అంబులెన్స్‌లు వెళ్లేటప్పుడు, ఆర్గాన్స్ ట్రాన్స్ ప్లాంటేషన్ చేసేందుకు వీటిని ఆసుపత్రికి తరలించే క్రమంలో గ్రీన్ ఛానల్ ఇస్తారు. దీనికోసం జిల్లాలో ఉన్న అంబులెన్స్‌ల వివరాలను నమోదు చేస్తున్నాం. అన్ని వివరాలతో డేటా బేస్‌ను తయారు చేస్తున్నాం. గంటల కొద్దీ వాహనదారులు నిరీక్షించాల్సి వస్తున్న పరిస్థితిని దీని ద్వారా అధిగమించవచ్చు. ఈ-పాత్ యాప్ అందుబాటులోకి వస్తే వాహనదారులకు నిరీక్షణ ఉండదు. త్వరలోనే ఇది అందుబాటులోకి రానుంది". అని విజయవాడ సీపీ రాజశేఖరబాబు తెలియజేశారు.

# 38 పట్టణ ప్రాంతాల్లో 2 రోజులకోసారి నీటి సరఫరా

**అమరావతి, పతాకం న్యూస్:** పట్టణ ప్రాంతాల్లో మంచినీటి సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామని, ప్రస్తుతం 38 పట్టణ ప్రాంతాల్లో రెండు రోజులకోసారి నీటి సరఫరా చేస్తున్నామని, ఏడు చోట్ల మూడు రోజులకోసారి సరఫరా చేస్తున్నామని పట్టణాభివృద్ధి శాఖ డైరెక్టర్ సంపత్‌కుమార్ తెలిపారు. పట్టణాభివృద్ధిశాఖ ఆధ్వర్యాన రాష్ట్రంలో 123 పట్టణ స్థానిక సంస్థల్లో తాగునీటి సరఫరా పరిస్థితి, వేసవిలో అత్యవసర చర్యలు, సమ్మర్ యాక్షన్ ప్లాన్--2026 అమలుపై మాట్లాడారు. ప్రస్తుతం పట్టణ ప్రాంతాల్లో రోజుకు 2,860 ఎంఎల్‌డి తాగునీటి అవసరం ఉండగా, 2098 ఎంల్ఎడి మాత్రమే సరఫరా చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికీ 762 ఎంఎల్‌డి లోటు ఉన్నట్టు వెల్లడించారు. 19 పట్టణ ప్రాంతాల్లో మాత్రమే అత్యధికంగా వ్యక్తికి రోజుకు 135 లీటర్లకుపైగా నీటి సరఫరా జరుగుతుండగా, 33 యుఎల్‌బిల్లో 70 లీటర్ల కంటే తక్కువగా సరఫరా జరుగుతున్నట్టు వివరించారు. నీటి వనరులు తగ్గడంతో 27 మున్సిపాలిటీల్లో రోజుకు రెండు సార్లు, 51 చోట్ల రోజుకు ఒకసారి, 38 చోట్ల రెండు రోజులకోసారి, ఏడు మున్సిపాలిటీల్లో మూడు రోజులకోసారి లేదా అంతకంటే ఎక్కువ వ్యవధిలో నీటి సరఫరా జరుగుతోందని తెలిపారు. అదనపు నీటి వనరులుగా రాష్ట్ర వ్యాప్తంగా 37,723 బోర్లు వినియోగంలో ఉండగా, వాటి ద్వారా 251 ఎంఎల్‌డి నీరు సరఫరా చేస్తున్నట్టు వెల్లడించారు. అలాగే 416 ట్యాంకర్ల ద్వారా రోజుకు సుమారు 11.97 ఎంఎల్‌డి తాగునీరు సరఫరా చేస్తున్నట్టు పేర్కొన్నారు. నీటి నాణ్యత పర్యవేక్షణలో భాగంగా పరీక్షించిన 11,097 నమూనాలన్నీ సంతృప్తికరంగా ఉన్నట్టు తెలిపారు. వేసవి పరిస్థితులను ఎదుర్కొనేందుకు నీటి వనరుల విస్తరణ, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను నింపడం, కాలువల వద్ద క్రాస్ బండ్లు ఏర్పాటు చేయడం, బోర్‌వెల్ ఫ్లషింగ్ లోతు పెంపు, హ్యాండ్‌బోర్లు, పంపుసెట్ల మరమ్మతులు, పైపులైన్ లీకేజీల నివారణ, అవసరమైన చోట జనరేటర్ల ఏర్పాటు, ట్యాంకర్ల ద్వారా



తాగునీటి సరఫరా వంటి చర్యలు చేపట్టినట్టు వివరించారు. ప్రజల్లో నీటి వినియోగంపై అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నట్టు వివరించారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్--2026 కింద 104 మున్సిపాలిటీల్లో రూ.57.36 కోట్ల వ్యయంతో మొత్తం 919 పనులు చేపట్టగా, అందులో 449 పనులు టెండర్ దశలో, 470 పనులు అమలు దశలో ఉన్నట్టు వెల్లడించారు.

# పౌష్టికాహారం పంపిణీలో ఎ-ప్లస్ గ్రేడ్

**అమరావతి, పతాకం న్యూస్:** రాష్ట్రంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించడంలో 96.22 శాతం, చిన్నారులకు 97.29 శాతం లక్ష్యాన్ని చేరుకుని ఎ-ప్లస్ గ్రేడ్ సాధించిందని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ కార్యదర్శి ఎ సూర్యకూమారి వెల్లడించారు. మె మహిళాభివృద్ధి, శిశు సంక్షేమానికి చేపట్టిన కార్యక్రమాల గురించి వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న సేవలపై ప్రత్యేకంగా దృష్టి సారించామనానరు. పాలు, గుడ్లు, బాలామృతం వంటి పోషకాహార పదార్థాలను సమయానికి సరఫరా చేయడం, నిరంతర పర్యవేక్షణ చేపట్టడం వల్ల ఐదేళ్లలోపు పిల్లల్లో ఎదుగుదల లోపం, తక్కువ బరువు సమస్యలు గణనీయంగా తగ్గాయని పేర్కొన్నారు. 'పోషణ్ ట్రాకర్'లో వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని కలెక్టర్లకు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలను కేవలం పౌష్టికాహార కేంద్రాలుగానే కాకుండా చిన్నారులకు ఆహ్లాదకరమైన విద్యా వాతావరణం కల్పించే ప్రీ-స్కూళ్లుగా తీర్చి దిద్దుతున్నామని తెలిపారు. రాష్ట్రంలో



మంజూరైన 13,916 మరుగుదొడ్లలో ఇప్పటికే 9,209 నిర్మాణాలు పూర్తయ్యాయని చెప్పారు. 15,521 తాగునీటి కనెక్షన్లలో 12,131 కేంద్రాల్లో పనులు పూర్తయ్యాయని వెల్లడించారు. మిగిలిన పనులను త్వరగా పూర్తి చేయడంతో పాటు విద్యుత్ సదుపాయం లేని కేంద్రాలకు వెంటనే విద్యుదీకరణ చేయాలని కలెక్టర్లను ఆదేశించారు.

అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీలకు సొంత భవనాల నిర్మాణం కోసం స్థలాలు కేటాయించాలని సూచించారు. ఇప్పటికే 8,809 అంగన్‌వాడీ కేంద్రాలను సమీప ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లోకి మార్చామని, ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని పేర్కొన్నారు. ప్రధాన మంత్రి జన్మన్ పథకం కింద గిరిజన ప్రాంతాల్లో మంజూరైన 192 అంగన్‌వాడీ కేంద్రాల్లో 156 భవనాల నిర్మాణం పూర్తయిందని తెలిపారు. అలాగే 365 మినీ అంగన్‌వాడీలను ప్రధాన కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేసే ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రస్తుతం ప్రీ-స్కూల్ హాజరు శాతం 89గా ఉందని, దాన్ని 90 శాతానికి పైగా పెంచేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. మూడేళ్లు నిండిన ప్రతి చిన్నారిని అంగన్‌వాడీలో చేర్పించేలా ఇంటింటి సర్వే నిర్వహించాలని ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 641 అంగన్‌వాడీ కార్యకర్తలు, 131 మినీ కార్యకర్తలు, 5,325 సహాయకుల పోస్టుల భర్తీ ప్రక్రియను మే 2026 నాటికి పూర్తి చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. బాల్య వివాహాలను అరికట్టడంలో ప్రభుత్వం పూర్తిస్థాయి విజయం సాధించిందని తెలిపారు.

## వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి



**కడప, పతాకం న్యూస్:** కడప జిల్లా రాజంపేట మండల పరిధిలోని రెండు వేరువేరు ప్రాంతాలలో జరిగిన రోడ్డు ప్రమాదాలలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా, ఎనిమిది మంది తీవ్ర గాయాలు పాలయ్యారు. వివరాల్లోకి వెళితే.. రాజంపేట పట్టణంలోని ఉస్మాన్ నగర్ బైపాస్ వద్ద అర్ధరాత్రి సమయంలో బస్సు, కారు ఢీకొన్న ఘటనలో కారులో ప్రయాణిస్తున్న తిరుపతి ఆటోనగర్ కు చెందిన పూర్ణచంద్ర రాజు (52) అక్కడికక్కడే మృతి చెందగా ఇద్దరు తీవ్ర గాయాల పాలయ్యారు. బత్తల బాలాజీ, పూర్ణచంద్ర రాజు, కృష్ణమనేని శశిధర్ లు రాత్రి తిరుపతి నుండి కడపకు కారులో వెళుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి గాయపడిన వారికి అదే వైద్యశాలలో చికిత్స అందజేసి వారి బంధువులకు సమాచారం అందజేశారు. అలాగే తెల్లవారుజామున మండల పరిధిలోని వెంకట రాజంపేట వద్ద కడప నుండి ఓబులవారిపల్లెకు వెళుతున్న సిమెంట్ లారీని తిరుపతి నుండి తాడిపత్రికి వెళుతున్న ఇతియోస్ కారు ఢీకొన్న ఘటనలో ఓబులవారిపల్లె మండలం గాడివారిపల్లె గ్రామానికి చెందిన కోటకొండ సుబ్బమ్మ (56) అక్కడికక్కడే మృతి చెందారు. ఓబులవారిపల్లె మండలం వడ్డె పల్లెకు చెందిన మహాలక్ష్మి, జి.ప్రసాద్, పి.శివయ్య, వెంకటసుబ్బమ్మ, ఎరుకులమ్మ, లారీ డ్రైవర్ ఈశ్వరయ్య లు రాజంపేటలోని వివాహానికి హాజరయ్యేందుకు ఓబులవారిపల్లె క్రాస్ రోడ్డు వద్ద అదే కారులో ఎక్కగా వారు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే వెంకట రాజంపేట గ్రామస్తులు, హుటాహుటిన కారు వద్దకు చేరుకుని గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. 108 వాహనం కోసం ఫోన్ చేసినా గంటసేపైనప్పటికీ వాహనం రాకపోవడంపై గ్రామస్తులతోపాటు అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ బాధ్యులు పూల భాస్కర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ లో వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో మహిళ అక్కడికక్కడే మృతి చెందడం జరిగింది. ఈమె విజయనగరం మండలం రాకోడు గ్రామానికి చెందిన బోధంకి నారాయణమ్మ 76సంవత్సరాలు, మనవడు సురేష్ ఇచ్చిన పిర్యాదు పై ఎస్ఐ రవి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వన్టౌన్ సిఐ చౌదరి తెలిపారు.

## ఏపీ పేపర్ మిల్లు అక్రమ లాకౌట్ ఎత్తివేయాలి



**కడియం, పతాకం న్యూస్:** తూర్పు గోదావరి జిల్లా కడియంలోని ఎపి పేపర్ మిల్లు కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, అక్రమ లాక్ అవుట్, సస్పెన్షన్లు ఎత్తి వేయాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎవి.నాగేశ్వరావు డిమాండ్ చేశారు. కడియం పేపర్ మిల్లు వద్ద కార్మికుల నిరసన శిబిరాన్ని ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎ.వి.నాగేశ్వరరావు మాట్లాడుతూ యాజమాన్యం నిరంకుశ వైఖరి వల్లే కడియం కాంట్రాక్ట్ కార్మికులు సమ్మెకు దిగాల్సి వచ్చిందన్నారు. పర్మినెంట్ కార్మికులుగా ఉన్న 11 మంది యూనియన్ నాయకులు, కాంట్రాక్ట్ కార్మికులను యాజమాన్యం అక్రమంగా సస్పెండ్ చేసిందని, ప్రభుత్వం అనుమతి లేకుండా ఏకపక్షంగా లాకౌట్ విధించడం దుర్మార్గమని అన్నారు. వేతన ఒప్పందం ముగిసి మూడేళ్లయినా యాజమాన్యం ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. పర్మినెంట్ కార్మికులు చేసే పనులను దీర్ఘ కాలంగా కాంట్రాక్టు కార్మికులతో చేయిస్తున్నారన్నారు. కార్మికుల హక్కుల రక్షణకు ఐక్యంగా పోరాడాలని పిలుపు నిచ్చారు. సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు టి.అరుణ్ మాట్లాడుతూ నాలుగు సార్లు చర్చలు జరిగినా యాజమాన్యం వైఖరి వల్ల విఫలమయ్యాయన్నారు. యాజమాన్యం నిరంకుశ వైఖరి వదిలి కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలన్నారు. కార్మికులకు సిఐటియు అండగా ఉంటుందన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సుందర్ బాబు, బి.పవన్, జిల్లా నాయకులు కె.రామకృష్ణ, బి.పూర్ణిమారాజు, గంటి కృష్ణ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## ఏపీలో పలువురు ఐఏఎస్ అధికారుల బదిలీ

**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్‌లో పలువురు ఐఏఎస్ అధికారులు బదిలీ అయ్యారు. ఐఏఎస్ అధికారుల బదిలీలు, అదనపు బాధ్యతలపై శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న శశి భూషణ్ కుమార్‌కు జలవనరుల శాఖ బాధ్యతలు అప్పగించింది. జలవనరుల శాఖ స్పెషల్ సీఎస్, ఫుల్ అడిషనల్ ఛార్జ్ బాధ్యతల నుంచి సీఎస్ సాయి ప్రసాద్‌కు ప్రభుత్వం రిలీఫ్ ఇచ్చింది. పర్యావరణ, అటవీ శాఖ ప్రధాన కార్యదర్శి కాంతిలాల్ దండేకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ ఉత్తర్వులు వెంటనే అమలులోకి వస్తాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు జీఓ ఆర్టీ నెంబర్ 918ను సీఎస్ జి.సాయి ప్రసాద్ జారీ చేశారు.

## కాకినాడలో సినీనటి మృణాల్ ఠాకూర్



**కడియం, పతాకం న్యూస్:** కాకినాడ నగరంలో ప్రముఖ వస్త్ర వ్యాపార సంస్థ చెన్నై షాపింగ్ మాల్ శనివారం ఘనంగా ప్రారంభమైంది. దీనిని సినీనటి మృణాల్ ఠాకూర్ ప్రారంభించి షాప్ అంతా తిరిగి సందడి చేశారు. 29వ షోరూంను కాకినాడలో ఏర్పాటు చేయడం పట్ల ఎంతో సంతోషంగా ఉందని యజమానులు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మృణాల్ ఠాకూర్ మాట్లాడుతూ .... ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాలకు విస్తరించిన చెన్నై షాపింగ్ మాల్ వస్త్ర ప్రపంచం నేడు కాకినాడ గుమ్మంలో కొలువు తీరిందన్నారు. పట్టు ఫ్యాన్సీ, రెడీమేడ్ ఒకటేమిటి లక్షల డిజైన్లు ఇప్పుడు సరికొత్త హంగులతో మగువల మనసు దోచే కంచి పట్టు చీరల వరకు అన్ని వెరైటీలు అందుబాటులోకి ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, వనమాడి ఉమా శంకర్, షాపింగ్ మాల్ నిర్వాహకులు ఎం వెంకటరెడ్డి, కృష్ణ రావు, తదితరులు పాల్గొన్నారు.

## 12 నుండి ఏపీ ఈఏపీ సెట్ 2026 పరీక్షలు

**కాకినాడ, పతాకం న్యూస్:** ఏపీ ఈ ఏపీ సెట్ 2026 పరీక్షలు ఈనెల 12, 13, 14, 15, 18 తేదీలలో ఇంజనీరింగ్ పరీక్షలు, 19, 20 తేదీలలో అగ్రికల్చర్ ఫార్మసీ స్ట్రీమ్ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు ఏపీ ఈ ఏపీ 2026 చైర్మన్, జేఎన్టీయూకే విసి ప్రొఫెసర్ సిఎస్ఆర్ కె ప్రసాద్ తెలిపారు. ఈ పరీక్షలకు ఇంజనీరింగ్ విభాగానికి రెండు లక్షల 75 వేల 784, అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షకు 78,435 మందితో పాటు మొత్తం మూడు లక్షల 55 వేల 11మంది పైగా నమోదైనట్లు ప్రసాద్ తెలిపారు. జేఎన్టీయూలోని విసి చాంబర్లో విలేకరులతో సమావేశం నిర్వహించి ఏపీఈ ఏపీ సెట్ 2026 విషయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ప్రసాద్ మాట్లాడుతూ ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం రెండు నుంచి ఐదు గంటల వరకు ఈ పరీక్షలను రాష్ట్రంలో 142 కేంద్రాల ద్వారా నిర్వహిస్తామని చెప్పారు. విద్యార్థులు పరీక్ష సమయానికి రెండు గంటల ముందే చేరుకోవాలని ఒక్క నిమిషం దాటిన లోనికి పరీక్ష రాసేందుకు అనుమతి లేదని స్పష్టం చేశారు. 23వ తేదీన కీ విడుదల చేస్తామని అందులో ఏమైనా అభ్యంతరాలు ఉంటే వాటిని స్వీకరించి నిపుణులతో చర్చించి దానికి సమాధానం అందిస్తామని చెప్పారు.

# డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉండాలంటే ఏమి చేయాలి?



సాధారణంగా చాలా మంది ఎదుర్కొనే అనారోగ్య సమస్యల్లో డీహైడ్రేషన్ (శరీరంలో నీటి లోపం) కూడా ఒకటి. ఇది కేవలం ఎండాకాలం లేదా కఠినమైన వ్యాయామం చేసే వాళ్లకే వచ్చే సమస్య కాదు. రోజువారీ జీవితంలో చిన్నచిన్న అలవాట్ల వల్ల చాలా మంది తెలియకుండానే దీర్ఘకాలిక డీహైడ్రేషన్‌కు గురవతున్నారు. ముఖ్యంగా ఉద్యోగులు, గృహిణులు, విద్యార్థులు, వృద్ధులు వంటి వారిలో ఇది ఎక్కువగా కనిపిస్తోంది. నీరు తాగడం మర్చిపోవడం, టీ-కాఫీలపై ఎక్కువగా ఆధారపడడం, దాహం వేయకపోతే నీరు అవసరం లేదనుకోవడం వంటి అలవాట్లు శరీరంపై నెమ్మదిగా ప్రభావం చూపిస్తున్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. నిపుణుల ప్రకారం దాహం వేయడం అనేది శరీరంలో నీటి లోపానికి ముందస్తు సంకేతం కాదు. దాహం అనిపించే సమయానికి శరీరం అప్పటికే స్వల్ప స్థాయిలో డీహైడ్రేషన్‌కు గురై ఉంటుందని వారు చెబుతున్నారు.

ముఖ్యంగా వృద్ధుల్లో దాహం గుర్తించే శక్తి తగ్గిపోవడంతో ఈ సమస్య మరింత ప్రమాదకరంగా మారుతోంది. రోజంతా ఏసీ గదుల్లో కూర్చుని పని చేసే వారికి కూడా శరీరం శ్వాస, చెమట, మూత్రం ద్వారా నిరంతరం ద్రవాలను కోల్పోతూనే ఉంటుంది. డీహైడ్రేషన్ వల్ల శరీరంపై అనేక రకాల ప్రభావాలు కనిపిస్తాయి. సరిపడా నిద్రపోయినా అలసటగా అనిపించడం, ఏకాగ్రత తగ్గడం, జ్ఞాపకశక్తి మందగించడం, తలనొప్పి, తల తిరగడం వంటి సమస్యలు వస్తాయి. అలాగే కండరాల పట్టుకుపోవడం, జీర్ణక్రియ మందగించడం, మలబద్ధకం, చర్మం పొడిబారడం వంటి లక్షణాలు కూడా కనిపిస్తాయి. కొందరిలో చిరాకు, ఆందోళన వంటి మానసిక మార్పులు కూడా కనిపిస్తాయని నిపుణులు చెబుతున్నారు. మధుమేహంతో బాధపడేవారిలో డీహైడ్రేషన్ ప్రభావం మరింత ఎక్కువగా ఉంటుంది. రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగినప్పుడు మూత్రం ఎక్కువగా వస్తుంది. దీంతో శరీరం మరింత నీటిని కోల్పోతుంది. డీహైడ్రేషన్ పెరిగితే రక్తంలో గ్లూకోజ్ మరింత సాంద్రత చెందుతుంది. ఇలా ఇది ఒక ప్రమాదకర చక్రంలా మారుతుంది.

వృద్ధుల్లో అయితే మూత్రపిండాల పనితీరు తగ్గిపోవడం వల్ల యూరినరీ ఇన్ఫెక్షన్లు, తక్కువ రక్తపోటు, తూలి పడిపోవడం వంటి సమస్యల ప్రమాదం పెరుగుతుంది. అయితే ఎక్కువ నీరు తాగితే సరిపోతుందనే భావన పూర్తిగా సరైనది కాదని వైద్యులు చెబుతున్నారు. శరీరానికి నీటితోపాటు ఎలక్ట్రోలైట్స్ కూడా అవసరం. సోడియం, పొటాషియం, మెగ్నీషియం, క్లోరైడ్ వంటి ఖనిజాలనే ఎలక్ట్రోలైట్స్ అంటారు. ఇవి శరీర కణాల్లో నీటి సమతుల్యతను కాపాడటంలో, నరాల పనితీరులో, కండరాల కదలికల్లో కీలక పాత్ర పోషిస్తాయి. చెమట ద్వారా శరీరం నీటితో పాటు ఈ ఖనిజాలను కూడా కోల్పోతుంది. కేవలం నీరు తాగడం వల్ల ద్రవాలు చేరినా, ఎలక్ట్రోలైట్ సమతుల్యత మాత్రం పునరుద్ధరించబడదు.

సంప్రదాయ పానీయాలు అయిన నిమ్మరసం, మజ్జిగ, కొబ్బరి నీరు వంటి వాటిలో సహజంగానే కొన్ని ఎలక్ట్రోలైట్స్ ఉంటాయి. అందుకే ఇవి శరీరాన్ని చురుకుగా ఉంచడంలో సహాయపడతాయి. అయితే ప్రతి సందర్భంలో ఇవి సరిపోవని వైద్యులు సూచిస్తున్నారు. అవసరమైనప్పుడు సరైన ఎలక్ట్రోలైట్ డ్రింక్స్ తీసుకోవడం మంచిదని చెబుతున్నారు. ఎలక్ట్రోలైట్ డ్రింక్స్ ఎంపికలో కూడా జాగ్రత్త అవసరం. అధిక చక్కెర కలిగిన పానీయాలు రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను పెంచి సమస్యలను మరింత పెంచుతాయి. కాబట్టి తక్కువ చక్కెరతో, సరిపడా సోడియం, పొటాషియం కలిగిన పానీయాలను మాత్రమే ఎంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా మధుమేహం, రక్తపోటు ఉన్నవారు వైద్యుల సలహాతోనే ఇలాంటి డ్రింక్స్ తీసుకోవడం మంచిది. ఆరోగ్యకరమైన జీవనశైలిలో హైడ్రేషన్‌కు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలని వైద్యులు సూచిస్తున్నారు. మధ్యాహ్నం అలసటగా అనిపించడం, తరచూ తలనొప్పి రావడం, మెదడు చురుకుదనం తగ్గిపోవడం వంటి సమస్యలు ఉంటే ముందుగా శరీరంలో నీటి లోపం ఉందేమో పరిశీలించుకోవాలి. సరైన సమయంలో తగినంత నీరు, అవసరమైన ఎలక్ట్రోలైట్స్ తీసుకోవడం ద్వారా అనేక ఆరోగ్య సమస్యలను సులభంగా నివారించవచ్చని పేర్కొంటున్నారు.

# హర్మూజ్‌లో కాల్పులు కలకలం



**ఇరాన్:** పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్తతలు తలెత్తాయి. కాల్పుల విరమణ ఒప్పందం అమలులో ఉన్నప్పటికీ హర్మూజ్ జలసంధి ప్రాంతం దాడులు, ప్రతి దాడులతో అట్టుడికిపోయింది. ఒకవైపు ఒప్పందానికి ఇరుదేశాలు దౌత్య ప్రయత్నాలు కొనసాగిస్తుండగా, మరోవైపు పరస్పరం దాడులు చోటుచేసుకున్నాయి. అమెరికా దళాలు ఇరాన్‌లోని పౌర నివాసాలపై వైమాని దాడులు చేసిందని ఆ దేశ ప్రభుత్వ మీడియా తెలిపింది. ఖేష్మ్ ద్వీపం, బందర్ అబ్బాస్ సమీపంలో పలు పేలుళ్లు చోటుచేసుకున్నాయని కూడా ధ్రువీకరించింది. పశ్చిమ టెహ్రాన్‌లో పెద్దగా పేలుడు శబ్దాలు వినిపించాయని వెల్లడించింది. అమెరికా దాడులకు దిగి కాల్పుల విరమణను ఉల్లంఘించిందని ఇరాన్ విమర్శించింది. దీనికి ప్రతిస్పందనగా తమ దాడుల్లో అమెరికా నౌకలు దెబ్బతిన్నాయని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్( ఐఆర్‌జిసి) ప్రకటించింది. తమ దేశానికి చెందిన యుద్ధ నౌకలు యుఎస్ఎస్ ట్రక్స్‌టన్ ( డిడిజి 103), యుఎస్ఎస్ రఫేల్ పెరాల్టా (డిడిజి 115), యుఎస్ఎస్ మాసన్ (డిడిజి 87) అంతర్జాతీయ జలాలలో ప్రయాణిస్తుండగా ఇరాన్ దళాలు అనేక క్షిపణులను ప్రయోగించిందని, అయితే అవేవీ తమ నౌకలను తాకలేకపోయాయని అమెరికా సెంట్రల్ కమాండ్ ఓ ప్రకటనలో తెలిపింది. అంతేకాకుండా ఇరాన్ సైనిక స్థావరాలే లక్ష్యంగా దాడులు జరిపామని కూడా తెలిపింది. ఇరాన్ నుంచి అనూహ్యంగా వచ్చిన దాడులను తాము అడ్డుకున్నామని.. ఆత్మరక్షణ కోసం వాటికి ప్రతిస్పందించామని అమెరికా తెలిపింది. ఈ దాడుల్లో ఏ నౌకలూ దెబ్బతినలేదని ప్రకటించింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి ఇరాన్ ను బెదిరించారు. హర్మూజ్‌లో చోటుచేసుకున్న ఘర్షణలపై ట్రంప్ స్పందిస్తూ. ఇరాన్ త్వరగా ఒప్పందంపై సంతకం చేయాలని రావాలని లేకుంటే భీకర దాడులు తప్పవని హెచ్చరించారు. ఈ మేరకు ఆయన ట్రూత్ సోషల్‌లో ఓ పోస్ట్ పెట్టారు. 'ఒప్పందంపై సంతకం చేయకపోతే భవిష్యత్తులో వారిని మరింత కఠినంగా, మరింత హింసాత్మకంగా వేధిస్తాం. త్వరపడండి' అని బితెలిపారు. 'మా నౌకలపై క్షిపణులను ప్రయోగించారు. వాటిని తేలికగానే కూల్చేశాం. అలాగే డ్రోన్లు వచ్చాయి. వాటిని గాలిలో ఉండగానే అడ్డుకున్నాం. అవి చాలా అత్యద్భుతంగా సముద్రంలో పడిపోయాయి...' అంటూ రాసుకొచ్చారు. అయితే కాల్పుల విరమణ ఒప్పందం మాత్రం కొనసాగుతోందనడం గమనార్హం.

# రాజ్‌మాకు ప్రభుత్వం తోడ్పాటు

## ఆదివాసీ రైతులకు రాయితీపై విత్తనాలు, ఎరువులు పంపిణీ



**చింతపల్లి, పతాకం న్యూస్:** ఏజెన్సీలో ఆదివాసీ రైతులు సంప్రదాయేతర పంటగా సాగు చేస్తున్న రాజ్‌మాకు రాష్ట్ర ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోంది. 2025-26 వార్షిక సంవత్సరంలో గిరిజన రైతులకు రాయితీపై నాణ్యమైన విత్తనాలతో పాటు తొలిసారిగా విత్తనశుద్ధి, జీవన ఎరువులను పంపిణీ చేసింది. రైతులు మొక్కలు నాటి నుంచి పంట కోసే వరకు వివిధ దశల్లో వ్యవసాయ అధికారులు సాంకేతిక సహకారం అందించడం వల్ల దిగుబడులు రెట్టింపయ్యాయి. ఎకరానికి సాధారణ దిగుబడి కంటే 2.4 క్వింటాళ్ల దిగుబడి పెరిగింది. వచ్చే ఏడాది సాగు విస్తీర్ణం పెంచడంతో పాటు ఎకరానికి గరిష్ఠంగా ఏడు క్వింటాళ్ల దిగుబడి సాధించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. రైతులకు శతశాతం రాయితీపై మేలిరకం విత్తనాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. దక్షిణ భారత దేశంలో అల్లూరి సీతారామరాజు జిల్లాలో మాత్రమే రాజ్‌మా పండుతుంది. ఆదివాసీ రైతులు 45 ఏళ్లగా రాజ్‌మా పంటను సంప్రదాయేతర వాణిజ్య పంటగా సాగుచేస్తున్నారు. 12 ఏళ్ల క్రితం వరకు ఆదివాసీ రైతులు సుమారు 45 వేల హెక్టార్లులో రాజ్‌మాను సాగుచేసేవారు. ప్రకృతి వైపరీత్యాలు, తెగుళ్ల కారణంగా కాలక్రమంగా గిరిజన ప్రాంతంలో సాగు విస్తీర్ణం గణనీయంగా పడిపోయింది. గత ప్రభుత్వం రాజ్‌మా పంటకు సరైన ప్రోత్సాహం అందించకపోవడం వల్ల సాగు విస్తీర్ణం గణనీయంగా పడిపోయింది. 2024-25లో పాడేరు డివిజన్ పరిధిలో కేవలం పదివేల ఎకరాల్లో మాత్రమే రాజ్‌మా సాగు చేపట్టారు. 2025-26 వార్షిక సంవత్సరంలో సాధార సాగు విస్తీర్ణం 20,600 ఎకరాలు కాగా, తొలిసారిగా గరిష్ఠంగా 45,875 ఎకరాల్లో రాజ్‌మా సాగు చేపట్టారు. చింతపల్లి పరిధిలోనే అత్యధికంగా 16,456 ఎకరాల్లో రైతులు రాజ్‌మా పంట పండించారు. దీంతో ఒకేసారి 94శాతం సాగు విస్తీర్ణం పెరిగింది. ఆదివాసీ రైతులు పండిస్తున్న రాజ్‌మా పంటకు పునరుజ్జీవం కల్పిస్తూ వ్యవసాయశాఖ వినూత్న ప్రయత్నం చేసింది. రైతులకు 90 శాతం రాయితీపై నాణ్యమైన చింతపల్లి రెడ్, చింతపల్లి వైట్ రకాల విత్తనాలను పంపిణీ చేసింది. అలాగే ప్రప్రథమంగా విత్తనశుద్ధి, జీవన ఎరువులను రాయితీపై అందజేసింది. ప్రభుత్వం పంపిణీ చేసిన విత్తనాలను రైతులు ట్రైకోడెమ్మవిరిడితో విత్తనశుద్ధి చేసుకుని నాట్లు వేసుకున్నారు. దీంతో విత్తనాల్లో మొలకెత్తేశాతం భారీగా పెరిగింది. అలాగే తెగుళ్లను నియంత్రించేందుకు 90 శాతం రాయితీపై వేప నూనె(నీమ్ ఆయిల్) అందజేశారు. రైతులు రాజ్‌మా పంటను పూర్తిగా ఆర్గానిక్ పద్ధతిలో సాగు చేస్తూ తెగుళ్లను ఆశించకుండా వేపనూనెను పిచికారీ చేసుకున్నారు. ప్రధానంగా రాజ్‌మా పంటలో రైతులతో కలుపుతీత పనులను వ్యవసాయ అధికారుల పర్యవేక్షణలో నిర్వహించారు. ప్రభుత్వం పంపిణీ చేసిన జీవన నియంత్రణ ఎరువులు పంటలకు పెట్టుకోవడం వల్ల మొక్కలకు అవసరమైన నత్రజని, భాస్వరం, పొటాష్ పూర్తి స్థాయిలో అందాయి. ఈ విధానాల వల్ల రాజ్‌మా పంటలో తెగుళ్లు, చీడపీడలు ఆశించకపోతే మొక్కలు ఏపుగా పెరిగాయి. నూర్పు సమయంలోనూ గింజలు పగిలిపోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. వ్యవసాయశాఖ రాజ్‌మా నాట్లు వేసిన నాటి నుంచి పంట కోసే వరకు వివిధ దశల్లో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు కచ్చితంగా రైతులతో చేయించడం వల్ల దిగుబడులు రెట్టింపయ్యాయి. కొన్నేళ్లగా ఆదివాసీ రైతులు రాజ్‌మా ఎకరానికి కేవలం 2.4 క్వింటాళ్ల దిగుబడికి మించి పొందడం లేదు. గత ఏడాది వ్యవసాయశాఖ చేపట్టిన వినూత్న ప్రయత్నం వల్ల ఈ ఏడాది రైతులు 4.8 క్వింటాళ్ల దిగుబడి సాధించారు. జీకేవీధి, చింతపల్లి మండలాల్లో కొంత మంది రైతులు 5.3 క్వింటాళ్ల దిగుబడి సాధించారు. గిరిజన రైతులు వ్యవసాయశాఖ సూచనలతో సాగు విధానంలో స్వల్ప మార్పులు చేసుకోవడం వల్ల ఊహించని విధంగా దిగుబడులు రెట్టింపు కావడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కాగా ఈ ఏడాది ఎకరానికి ఏడు క్వింటాళ్ల దిగుబడి సాధించాలని వ్యవసాయశాఖ లక్ష్యంగా చేసుకున్నది. అలాగే రైతులకు ఈ ఏడాది రాజ్‌మా ద్వారా అధిక ఆదాయం వచ్చింది. క్వింటా రాజ్‌మాను గరిష్ఠంగా రైతులు రూ.8,200 ధరకు విక్రయించారు. కిలోకి రూ.82 ధర లభించింది. గిరిజన ప్రాంతంలో రాజ్‌మా సాగు విస్తీర్ణం పెంపొందించేందుకు వ్యవసాయశాఖ ఈ ఏడాది వార్షిక ప్రణాళిక సిద్ధం చేసింది. 2024-25 వార్షిక సంవత్సరంలో రాజ్‌మా కేవలం పదివేల ఎకరాల్లో సాగు చేయగా, 2025-26లో వ్యవసాయశాఖ కృషి ఫలితంగా 45,875 ఎకరాల్లో సాగు చేశారు. ఈ ఏడాది సాగు విస్తీర్ణం 60 వేల ఎకరాలకు పెంచాలని నిర్ణయించారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ రాజ్‌మా సాగును ప్రోత్సహించడం వల్ల రైతులు సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.




## ఫిన్ ఆలెన్ మెరుపు శతకం..

# కోల్‌కతా నైట్‌రైడర్స్ ఘన విజయం



తొలి ఆరు మ్యాచ్‌ల్లో గెలుపనేదే లేకుండా సాగిన కోల్‌కతా నైట్‌రైడర్స్ ఆలస్యంగానైనా అద్భుతంగా పుంజుకుంది. ప్రత్యర్థి బ్యాటర్లు పరుగుల కోసం కష్టపడిన చోట ఓపెనర్ ఫిన్ ఆలెన్ (47 బంతుల్లో 5 ఫోర్లు, 10 సిక్సర్లతో 100 నాటౌట్) అజేయ శతకంతో హోరెత్తించాడు. ఫలితంగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో నైట్‌రైడర్స్ 8 వికెట్లతో ఘనవిజయం సాధించింది. కోల్‌కతాకిది వరుసగా నాలుగో విజయం కావడం విశేషం. దీంతో పట్టికలో 9 పాయింట్లతో ఏడో స్థానానికి చేరింది. ముందుగా ఢిల్లీ క్యాపిటల్స్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 142 పరుగులు చేసింది. ఓపెనర్ నిస్సాంక (29 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సర్లతో 50), అశుతోష్ శర్మ (28 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్లతో 39), కేఎల్ రాహుల్ (14 బంతుల్లో 4 ఫోర్లతో 23) మాత్రమే రాణించారు. కార్తీక్ త్యాగి, అనుకుల్ రాయ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. స్వల్ప ఛేదనలో కోల్‌కతా 14.2 ఓవర్లలో 2 వికెట్లకు 147 పరుగులు చేసి గెలిచింది. కామెరూన్ గ్రీన్ (27 బంతుల్లో 2 సిక్సర్లతో 33 నాటౌట్) ఆకట్టుకున్నాడు. సెంచరీ హీరో ఫిన్ ఆలెన్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. స్వల్ప ఛేదనను కోల్‌కతా సునాయాసంగా ముగించింది. ఓపెనర్ ఫిన్ ఆలెన్ ఢిల్లీ బౌలర్లను ఆడేసుకున్నాడు. ఢిల్లీ బ్యాటర్లు కష్టపడిన చోట అతను ఏకంగా 10 సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. అతడికి గ్రీన్ సహకరించడంతో కోల్‌కతా 34 బంతులుండగానే మ్యాచ్‌ను ముగించింది. ఆరంభంలో మరో ఓపెనర్ రహానె (13) కూడా వేగంగా ఆడినా, అతను మూడో ఓవర్‌లోనే రనౌట్‌గా వెనుదిరిగాడు. తర్వాతి ఓవర్‌లో రఘువంశీ (1)ని అక్షర్ పటేల్ బౌల్డ్ చేశాడు. స్వీప్ షాట్ ఆడే క్రమంలో బంతి అతడి గ్లౌవ్స్‌ను తాకి పైకి లేచి కింద పడే క్రమంలో బెయిల్స్‌ను తాకింది. ఇక, పవర్‌ప్లే తర్వాత ఆలెన్ విధ్వంసం సాగింది. స్పిన్నర్లను లక్ష్యంగా చేసుకుని బౌండరీలు రాబట్టాడు. 32 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తయ్యాక అతడు మరింత చెలరేగాడు. విప్రజ్ ఓవర్‌లో హ్యాట్రిక్ సిక్సర్లు బాది 21 రన్స్ అందించాడు. ఇక విజయానికి రెండు పరుగులు.. శతకానికి ఆరు పరుగులు కావాల్సిన తరుణంలో పేసర్ ముకేశ్ షార్ట్ పిచ్ బంతిని ఆలెన్ సిక్సర్‌గా మలిచాడు. దీంతో ఐపీఎల్‌లో తన తొలి శతకం నమోదు చేయడంతో పాటు జట్టును కూడా గెలిపించి సంబరాలు చేసుకున్నాడు. మూడో వికెట్‌కు ఆలెన్-గ్రీన్ అజేయంగా 116 పరుగుల భాగస్వామ్యం నమోదు చేశారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ పరుగుల కోసం తీవ్రంగా శ్రమించింది. ఈ క్రమంలో వికెట్లను కూడా చేజార్చుకుంది. ఓపెనర్ నిస్సాంకతో పాటు చివర్లో అశుతోష్ మినహా ఇతర బ్యాటర్లు ఏమాత్రం ప్రభావం చూపలేదు. కోల్‌కతా పేసర్లు, స్పిన్నర్లు అత్యంత కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో ఢిల్లీ 150 పరుగులైనా చేయలేకపోయింది. వాస్తవానికి నిస్సాంక మరో ఓపెనర్ రాహుల్ ఇన్నింగ్స్‌ను మెరుగ్గానే ఆరంభించారు. చెత్త బంతులను బౌండరీలకు తరలిస్తూ చకచకా పరుగులు రాబట్టారు. పేసర్ కార్తీక్ ఐదో ఓవర్‌లో రాహుల్‌ను అవుట్ చేయడంతో తొలి వికెట్‌కు 49 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అక్కడి నుంచి ఢిల్లీ అనూహ్యంగా తడబడింది. నితీశ్ రాణా (8), సమీర్ రిజ్వీ (3), స్టబ్స్ (2)లను ఏమాత్రం కుదురుకోనీయకుండా ప్రత్యర్థి బౌలర్లు పెవిలియన్‌కు చేర్చడంతో జట్టు తీవ్ర ఒత్తిడిలో పడింది. దీనికితోడు 28 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేసిన నిస్సాంక స్టంపౌట్ కావడం మరింత దెబ్బతీసింది.

# టీమిండియా టీ20 కెప్టెన్‌గా సంజు శాంసన్!




టీమిండియా టీ20 కెప్టెన్సీలో ఊహించని మలుపు చోటు చేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం కెప్టెన్‌గా ఉన్న సూర్యకుమార్ యాదవ్‌పై వేటు పడనుందని సమాచారం. ఈ క్రమంలోనే కొత్త సారథిగా శ్రేయస్ అయ్యర్ పేరు వినిపించగా.. తాజాగా వరల్డ్ కప్ హీరో సంజు శాంసన్ కూడా రేసులోకి వచ్చినట్లు తెలుస్తోంది. ఐపీఎల్ ముగిసిన తర్వాత సెలక్షన్ కమిటీ సమావేశం కానుంది. అప్పుడు కొత్త సారథిగా సంజును ప్రకటిస్తారని సమాచారం. ఈ ఏడాది టీ20 ప్రపంచకప్ గెలిచిన తర్వాత భారత్ జట్టు ఎటువంటి అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడలేదు. జూన్ నెలాఖరులో ఐర్లాండ్‌తో రెండు టీ20ల సిరీస్‌తో కొత్త సీజన్‌ను ఆరంభించనుంది. సంజు శాంసన్ విషయానికి వస్తే.. టీ20 ప్రపంచకప్ 2026లో కీలక ఇన్నింగ్స్‌లు ఆడటం, ప్రస్తుతం ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ తరఫున అద్భుతంగా ఆడుతున్నాడు. అలానే గతంలో రాజస్థాన్ రాయల్స్‌కు కెప్టెన్‌గా వ్యవహరించిన అనుభవం ఉంది. సంజూ వికెట్ కీపర్‌గా కూడా జట్టుకు అదనపు బలంగా ఉన్నాడు. ఈ కారణాలతో శాంసన్ వైపు బీసీసీఐ సెలక్టర్లు మొగ్గు చూపుతున్నారని సమాచారం. ఐపీఎల్ 2026లో శాంసన్ ఇప్పటివరకు 10 మ్యాచ్‌లు ఆడి 402 పరుగులు చేశాడు. ఇందులో రెండు సెంచరీలు, ఒక హాఫ్ సెంచరీ ఉన్నాయి. మరోవైపు ఐపీఎల్‌లో పంజాబ్ జట్టుకు సారథిగా, ఆటగాడిగా రాణిస్తున్నప్పటికీ చాలాకాలంగా టీ20 జట్టుకు దూరంగా ఉండటం శ్రేయస్‌కు ప్రతికూలంగా మారిందని క్రీడా నిపుణులు అభిప్రాయపడుతున్నారు. శ్రేయస్ అయ్యర్ చివరి టీ20 మ్యాచ్ 2023 డిసెంబర్‌లో ఆడాడు. ఇంత విరామం తీసుకున్న అయ్యర్‌ను జట్టులోకి తీసుకుని నేరుగా కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించడం రిస్క్‌గా బీసీసీఐ సెలెక్టర్లు భావిస్తున్నారని సమాచారం.




## ట్రైలర్ రిలీజ్ కాకముందే
# 'పెద్ది' రికార్డుల వేట



సాధారణంగా ఒక సినిమా బాక్సాఫీస్ సత్తా ఏంటో తెలియాలంటే థియేట్రికల్ ట్రైలర్ రిలీజ్ అయ్యే వరకు వేచి చూడాలి. ట్రైలర్ ఇచ్చే కిక్కును బట్టే ఆ సినిమా మార్కెట్ పొటన్షియాలిటీ ఆధారపడి ఉంటుంది. కానీ, కొన్ని సినిమాలు మాత్రం ఈ లెక్కలకు అతీతం. కేవలం క్రేజీ కాంబినేషన్ మీద ఉన్న నమ్మకం, హీరో ఇమేజ్ ఇచ్చే ధైర్యంతోనే అంచనాలు ఆకాశాన్ని తాకుతుంటాయి. ఇప్పుడు గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, సెన్సేషనల్ డైరెక్టర్ బుచ్చిబాబు సన కాంబినేషన్‌లో వస్తున్న పెద్ది సినిమా సరిగ్గా ఇదే మ్యాజిక్ చేస్తోంది. పెద్ది సినిమా అనౌన్స్ చేసినప్పటి నుంచి కూడా అంచనాలు ఆకాశాన్ని తాకుతూనే ఉన్నాయి. ఇక రిలీజ్ డేట్ దగ్గరపడుతున్న కొద్దీ పెద్ది రికార్డుల మీద రికార్డులు సృష్టిస్తోంది. తాజాగా ఈ సినిమా సృష్టిస్తున్న మేనియా ఏ రేంజ్ లో ఉందంటే.. ఇంకా ట్రైలర్ కూడా బయటకు రాకముందే నార్త్ అమెరికాలో రికార్డుల వేట మొదలైపోయింది. బుకింగ్స్ ప్రారంభించిన కేవలం నాలుగు గంటల్లోనే 100కే మార్కును దాటి సెన్సేషన్ క్రియేట్ చేసింది. ఇప్పటి వరకు ఏ భారతీయ సినిమాకు సాధ్యం కాని రీతిలో, అతి తక్కువ సమయంలో ఈ మైలురాయిని చేరుకోవడం ఒక్క రామ్ చరణ్‌కే చెల్లింది. మెగా పవర్ స్టార్ గ్లోబల్ ఇమేజ్ బాక్సాఫీస్ వద్ద ఏ స్థాయి సునామీ సృష్టించబోతుందో చెప్పడానికి ఈ లెక్కలే నిదర్శనం. మెగా అభిమానులు కళ్ళలో ఒత్తులు వేసుకుని ఎదురుచూస్తున్న జూన్ 3వ తేదీ రానే వస్తోంది. ఆ రోజు ఓవర్సీస్‌లో భారీ ఎత్తున ప్రీమియర్లతో పెద్ది జాతర మొదలుకానుంది. ఇప్పటి వరకు విడుదలైన టీజర్స్, స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఆ రా అండ్ రస్టిక్ లుక్స్ సినిమాపై విపరీతమైన ఆసక్తిని పెంచుతున్నాయి. ఆన్‌లైన్ వార్తలు ఇప్పటికే పెద్ది నుంచి రిలీజైన పాటలు, విజువల్స్ చార్ట్ బస్టర్స్ గా నిలిచాయి. అదేవిధంగా త్వరలో రాబోయే థియేట్రికల్ ట్రైలర్ సినిమాపై అంచనాలను మరో స్థాయికి తీసుకెళ్లడం ఖాయం. అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా, అభిమానులను ఉర్రూతలూగించేలా బుచ్చిబాబు.. ప్రతి సీన్‌ను చెక్కినట్లు తెలుస్తోంది. పెద్ది ఒక ఎమోషనల్ అండ్ మాస్ ఎంటర్టైనర్ అని, ఎక్కడా తగ్గకుండా హై వోల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్‌లతో ఈ చిత్రం ఉండబోతోందని సినిమా యూనిట్ చెప్పుకొస్తోంది. పాన్ ఇండియా వైడ్ గా పెద్ది మేనియా ఇప్పుడిప్పుడే మొదలైంది. బాక్సాఫీస్ వద్ద రికార్డులను తిరగరాయడానికి, సరికొత్త బెంచ్ మార్క్ సెట్ చేయడానికి గ్లోబల్ స్టార్ సిద్ధమైపోయాడు. మరి ఈ సినిమా థియేటర్లలో ఎలాంటి ప్రకంపనలు సృష్టిస్తుందో చూడాలంటే మరికొద్ది రోజులు వేచి చూడాల్సిందే.

# ఓటీటీలో 'ధురంధర్-2'

బాలీవుడ్ స్టార్ హీరో రణవీర్ సింగ్ నటించిన స్పై థ్రిల్లర్ 'ధురంధర్ 2: ది రివెంజ్' ఓటీటీ విడుదల తేదీ ఖరారైంది. థియేటర్లలో రికార్డు స్థాయి వసూళ్లు సాధించిన ఈ చిత్రం, మే 14 నుంచి అంతర్జాతీయంగా నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. అయితే, భారత్‌లో మాత్రం ఈ సినిమా నెట్‌ఫ్లిక్స్‌లో అందు బాటులో ఉండదు. దీంతో భారత ప్రేక్షకులు ఎక్కడ చూడాలనే దానిపై ఆసక్తి నెలకొంది.



ఆదిత్య ధర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం మార్చి 19న థియేటర్లలో విడుదలై బాక్సాఫీస్ వద్ద ప్రభంజనం సృష్టించింది. తాజాగా నెట్‌ఫ్లిక్స్ అధికారికంగా విడుదల తేదీని ప్రకటించింది. ఈ సినిమా 'రా అండ్ అన్ దేఖా' అనే ట్యాగ్‌లైన్‌తో, దాదాపు 3 గంటల 52 నిమిషాల సుదీర్ఘ రన్‌టైమ్‌తో రానుంది. సెన్సార్ చేయని సన్నివేశాలు, అదనపు ఫుటేజ్‌తో ఈ ప్రత్యేక వర్షన్‌ను విడుదల చేయనున్నారు. భారత్‌లో ఈ చిత్రాన్ని జియోహాట్‌స్టార్ ప్లాట్‌ఫామ్‌పై మే 14నే విడుదల చేయవచ్చని కొన్ని కథనాలు సూచిస్తున్నాయి. అయితే, దీనిపై నిర్మాతల నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. సినిమాలోని ఒక పాట రీమిక్స్‌పై కోర్టులో కేసు నడుస్తున్న నేపథ్యంలో, థియేట్రికల్ రిలీజ్ తర్వాత 8 వారాల గ్యాప్ ఇచ్చాకే ఓటీటీలోకి వస్తుందని నిర్మాతలు గతంలో తెలిపారు. మే 14 నాటికి సినిమా విడుదలై సరిగ్గా 8 వారాలు పూర్తవుతుంది.

ఈ చిత్రంలో రణవీర్ సింగ్‌తో పాటు సారా అర్జున్, అర్జున్ రాంపాల్, ఆర్. మాధవన్, సంజయ్ దత్ కీలక పాత్రలు పోషించారు. ఇప్పటివరకు ఈ సినిమా భారత్‌లో రూ. 1,140 కోట్ల నెట్ కలెక్షన్లు సాధించగా, ప్రపంచ వ్యాప్తంగా రూ. 1,791 కోట్ల గ్రాస్ వసూళ్లు రాబట్టింది. అంతర్జాతీయంగా విడుదల తేదీ ఖరారైనప్పటికీ, భారత్‌లోని ఓటీటీ రిలీజ్‌పై అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు.

# సూర్య కొత్త చిత్రానికి 'అన్ కట్ 15' సెన్సార్ సర్టిఫికెట్



తమిళ స్టార్ హీరో సూర్య నటిస్తున్న తాజా చిత్రం 'కరుప్పు' విడుదలకు సిద్ధమైంది. ఈ చిత్రానికి బ్రిటన్ సెన్సార్ బోర్డు ఎలాంటి కట్స్ లేకుండా 'అన్ కట్ 15' సర్టిఫికేట్ జారీ చేసింది. మే 14న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ చిత్రానికి, ఇప్పటికే భారత సెన్సార్ బోర్డు 'ఖ/ఊ' సర్టిఫికేట్ ఇచ్చిన విషయం తెలిసిందే. యూకే, యూరప్‌లో ఈ సినిమాను పంపిణీ చేస్తున్న అహింస ఎంటర్‌టైన్‌మెంట్ ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించింది. "యూకే సెన్సార్ బోర్డు 'కరుప్పు' చిత్రాన్ని వీక్షించి, కట్స్ లేకుండా '15' రేటింగ్ ఇచ్చింది. మే 14న థియేటర్లలో భారీ పండగ వాతావరణం ఖాయం" అని నిర్మాణ సంస్థ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. దర్శకుడు ఆర్జే బాలాజీ అద్భుతంగా సినిమాను తీశారని ప్రశంసించింది. గతేడాది సూర్య పుట్టినరోజున విడుదలైన 'కరుప్పు' టీజర్ సినిమాపై అంచనాలను భారీగా పెంచేసింది. ఈ చిత్రంలో సూర్య 'శరవణన్' అనే లాయర్ పాత్రలో, అలాగే 'కరుప్పు' అనే మరో పేరుతో కనిపిస్తారని టీజర్ ద్వారా స్పష్టమైంది. పవర్‌ఫుల్ యాక్షన్ సన్నివేశాలు, పంచ్ డైలాగులతో ఇది పూర్తిస్థాయి కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా ఉండబోతోందని తెలుస్తోంది. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో త్రిష కథానాయికగా నటిస్తుండగా, యోగి బాబు, నాటి, మలయాళ నటులు ఇంద్రాన్స్, శివాడ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

యువ సంగీత సంచలనం సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తుండగా, 'బిగిల్', 'జవాన్' వంటి భారీ చిత్రాలకు పనిచేసిన జీకే విష్ణు సినిమాటోగ్రాఫర్‌గా పనిచేశారు. భారీ అంచనాల మధ్య ఈ చిత్రం మే 14న ప్రేక్షకుల ముందుకు రానుంది.




Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**